ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 13.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 263 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



అండర్ 19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం 8

తప్పుడు ప్రచారం చేస్తే తోలు తీస్తా

బీఆర్ఎస్ నేతలు హద్దులు మీరుతున్నారు

వారం రోజులలో క్షమాపణలు చెప్పాలి



- అసత్యాల చానల్ ను కూడా వదిలిపెట్టను
- అందరికీ లీగల్ నోటీసులు పంపుతున్నా
- నేను ముఖ్యమంత్రిని అయితే వారి సంగతి చెబుతా
- కృష్ణారావు, ఏలేటి మాట్లాడిన తీరు బాగా లేదు
- నా భర్త పై ఆరోపణలు వాస్తవాలు
- వారు చెబుతున్న భూమిని 2019 లోనే అమ్మేశాం
- మండిపడిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 12: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నాయకత్వంపై నిప్పులు చెరిగారు. 'బీఆర్ఎస్ గుంటనక్కలూ జాగ్రత్త, నాపై తప్పుడు ప్రచారం చేస్తే తోలు తీస్తా' అంటూ ఆమె గర్జించడంతో తెలంగాణ రాజకీయాలలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తాను బీఆర్ఎస్ అక్రమాలు ప్రజలలో చెబుతుంటే తప్పుడు కథనాలు సృష్టించి సోషల్ మీడియాలో వ్యాప్తి చేసిన టీ న్యూస్‌తో పాటు బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు లీగల్ నోటీసులు పంపుతున్నానని హెచ్చరించారు. వారం రోజుల్లో క్షమాపణలు చెప్పకపోతే కోర్టు ముందు నిలబెట్టి

...:: మిగతా 2లో



అభిషేక్ మను సింఘ్వితో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం పగలు సమావేశమవుతారు. ప్రాజెక్ట్ పై చర్చిస్తారు. ఇటీవలనే పోలవరం - నలమల సాగర్ డీపీఆర్ రూపకల్పన కోసం టెండర్లను పిలిచారు. అన్ని ఆధారాలతో సుప్రీంకోర్టులో పోరాటం చేయాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అటు పనులను త్వరలోనే మొదలు పెట్టాలని సీఎం చంద్రబాబు కూడా అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి వరద జలాలను బొల్లాపల్లి, నల్లమల సాగర్‌కు, అలాగే, నాగార్జున సాగర్ నుంచి 50 టీఎంసీల కృష్ణా వరద జలాలను బొల్లాపల్లికి తరలించాలని సూచించారు.

ఏపీ కుట్రలకు తెలంగాణ చెక్

'పోలవరం-నల్లమలసాగర్' పై ఫైర్

ప్రాజెక్టును అడ్డుకోవాలని నిర్ణయం

- న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధం
- సుప్రీంకోర్టులో అభ్యంతరాల దాఖలు
- నేడు ఢిల్లీలో సన్నాహక సమావేశం
- పాల్గొననున్న మంత్రి ఉత్తమ్, అభిషేక్ సింఘ్వీ
- వాదనలను వినిపించాలని సింఘ్వీకి వినతి
- 'బనకచర్ల' సాధ్యం కాలేదని ఏపీ వెనుకడుగు
- ప్లాన్ మార్చి కొత్త ప్రాజెక్టుకు ప్రతిపాదనలు
- 200 టీఎంసీల వరద జలాలు తరలించే యోచన
- ఏపీ సీఎం ఆదేశాలతో టెండర్లు పిలిచిన అధికారులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 12: 'పోలవరం-నల్లమల్ల సాగర్ ఇరిగేషన్ ప్రాజెక్టు'పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వం మీద సుప్రీంకోర్టులో అభ్యంతరాలు దాఖలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీ తెలంగాణ భవన్ లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.బనకచర్లపై వెనక్కి తగ్గిన ఏపీ ప్రభుత్వం కొత్తగా ఈ ప్రాజెక్ట్‌ను తెరపైకి తీసుకువచ్చింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వేగంగా కసరత్తు చేస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు అటు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇంతకు ముందు బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలోనూ ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య పెద్ద వివాదమే చేలరేగింది. కేంద్ర ప్రభుత్వం తరపున కూడా ఆశించిన స్థాయిలో అనుమతులు రాక పోవటంతో ఏపీ సర్కార్ వెనక్కి తగ్గింది. డీపీఆర్‌లను కూడా రద్దు చేసింది. ఆ వెంటనే 'పోలవరం నలమల సాగర్ ప్రాజెక్ట్'కు

...:: మిగతా 2లో

'సిట్' ముందు లొంగిపోయిన మాజీ ఐజీ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం -
- ప్రభాకర్‌రావును విచారిస్తున్న అధికారులు
- క్లౌడ్ పాస్ వర్డులకు సంబంధించి ప్రశ్నలు
- కీలక ఆధారాలు ముందుపెట్టిన దర్యాప్తు బృందం
- వారం రోజులపాటు కస్టోడియల్ విచారణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరాబాద్, డిసెంబర్ 12: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట మాజీ ఐపీఎస్అధికారి ప్రభాకర్ రావు శుక్రవారం నాడు సిట్ అధికారుల ముందు లొంగిపోయారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విచారణ అధికారులు ఆయనను ప్రశ్నించారు. క్లౌడ్ పాస్ వర్డులకు సంబంధించి కీలక ఆధారాలు లభించినట్లు తెలిసింది. వాటి ఆధారంగా ఆయనను విచారించినట్లు సమాచారం. రివ్యూ కమిటీ అనుమతి లేకుండానే రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు ఫోన్ ట్యాప్ ఎందుకు, ఎవరికోసం? చేశారనే అంశంపై విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విచారణ ప్రక్రియను జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ పరిశీలించారు. వారం రోజుల పాటు ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణకు సుప్రీంకోర్టు గురువారం అనుమతి

...:: మిగతా 2లో



రాష్ట్రంలో చలి తీవ్రత

- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- 26 జిల్లాల్లో 10 డిగ్రీల లోపే
- వాతావరణ శాఖ వెల్లడి
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్‌లు జారీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్12: రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న చల్లటి గాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. సాధారణ కన్నా

...:: మిగతా 2లో

రేవంత్ పాలనా వైఫల్యంపై ప్రజలు విసిగిపోయారు

- కాంగ్రెస్ వంచనను గ్రామీణ ప్రజలు మరిచిపోలేదు
- అది ఈ ఎన్నికల ఫలితాలతో రుజువైపోయింది
- తెలంగాణలో ఇక ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే
- కాంగ్రెస్‌పాతాళానికి పడిపోవడం ఖాయం
- వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యం
- బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో



హైదరాబాద్, డిసెంబర్12: తొలిదశ పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా హోరాహోరీగా పోరాడి సర్పంచులుగా, వార్డుమెంబర్లుగా గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులకు బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్‌శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచకపర్వాన్ని ఎదుర్కొని నిలబడిన గులాబీ సైనికులందరికీ ప్రత్యేకంగా అభినందనలని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే పంచాయతీ ఎన్నికల కోసం జిల్లాల పర్యటనల పేరిట ప్రచారం చేసినా, పోటీచేసిన చోట కనీసం 44 శాతం సీట్లను కాంగ్రెస్ దాటకపోవడం ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. శుక్రవారం కేటీఆర్‌ఎక్స్‌వేదికగా స్పందించారు. పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగినప్పటికీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాలతో రుజువైపోయిందని, తెలంగాణ రాష్ట్రంలో ఇక ప్రత్యామ్నాయం కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని, బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని కూడా తొలిదశ పంచాయతీ ఫలితాలు కుండబద్దలు కొట్టి చెప్పాయన్నారు. వచ్చే మూడేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా

...:: మిగతా 2లో



జర్మనీతో సుదీర్ఘ స్నేహబంధం

- ఐటీ, డిఫెన్స్, ఫార్మాలో కలిసి పనిచేద్దాం
- జర్మనీ పార్లమెంటు బృందంతో డిప్యూటీ సీఎం
- 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతం
- లక్ష్యాలపై స్పష్టంగా ఉన్నారు: జర్మనీ పార్లమెంట్ బృందం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్12: జర్మనీ, భారతదేశం మధ్య సుదీర్ఘకాలంగా స్నేహబంధం కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత పటిష్టంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రజాభవన్ లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి జర్మనీ పార్లమెంటు బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు బృందాన్ని ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐటీ, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి తెలంగాణ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది, కలిసి పని చేద్దామని డిప్యూటీ సీఎం తెలిపారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులను జర్మనీకి పంపడానికి తెలంగాణ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, జర్మనీ ప్రసిద్ధి చెందిన మెటలర్జీ, కార్ల తయారీ రంగంలో జర్మనీతో కలిసి పని చేయడానికి తమ ప్రభుత్వం ముఖంగా ఉందని డిప్యూటీ సీఎం జర్మనీ పార్లమెంట్ బృందానికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది.మూసీ పునర్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగం పైన ఆసక్తిగా ఉంది, హైదరాబాద్ ఐటీ రంగానికి హబ్ గా వెలుగొందుతుందని, జర్మనీతో కలిసి పని చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

సైబర్ సెక్యూరిటీ కి అత్యంత ప్రాధాన్యత

తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దూర దృష్టితో సైబర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు చేశామని ఈ రంగంలో లోతుగా అధ్యయనం చేస్తున్నామని జర్మనీ పార్లమెంట్ బృందానికి

...:: మిగతా 2లో



యేడాది పొడవునా నియంత్రించలేం

ఇటీవల ఇండిగో సంక్షోభం సమయంలో విమాన చార్జీలు విపరీతంగా పెరిగాయి. దాంతో కేంద్రం ప్రభుత్వం రంగంలోకి దిగి టికెట్ల ధరలపై పరిమితిని విధించింది. తాజాగా విమాన చార్జీల నియంత్రణపై కేంద్రం కీలక ప్రకటన చేసింది.

7



జనవరి 30 నుంచి నిరాహార దీక్ష

ప్రభుత్వ తీరుకు నిరసనగా తాను జనవరి 30 నుంచి నిరాహార దీక్ష చేస్తానని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే ప్రకటించారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

7



చంద్రుడిపైకి పంపించాలా?

దేశంలో భూకంపాల వల్ల జరిగే నష్టాలను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయాలని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

7



'రాహుల్ 'ఒక అబద్ధాల దుకాణం

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీపై అధికార బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. రాహుల్‌గాంధీని ఒక అబద్ధాల దుకాణంగా అభివర్ణించింది.

7

రాష్ట్రీయం



'మేడారం' అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, సీతక్క
- సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న మంత్రులు

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్12: మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను, నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం తాడ్వాయి మండలం సమ్మక్క సారలమ్మ దేవాలయ గద్దెల పునరుద్ధరణ అభివృద్ధి పనులను, దేవాలయ ప్రాంగణంలోని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల రాతి నిర్మాణాలను, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్ పనులను, రాతి స్తంభాల స్థాపన నిర్మాణ పనులను, జంపన్న వాగు వద్ద పనులను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. సమ్మక్క, సారలమ్మలను మంత్రులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పూజారులు, ఆర్ అండ్ బీ, ఇంజనీరింగ్ అధికారులు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ

- జయంతి సందర్భంగా సీఎం నివాళులు..

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్11: దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.



పెద్దరికం పక్కనపెట్టి అమానుష దాడులా!

- ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అందే బాబయ్య
- దినేష్ సాగర్ ను పరామర్శించిన ముదిరాజ్ సంఘం
- ముదిరాజ్ కులం పేరుతో దూషించడం అమానుషం

ప్రతిపక్షం, షాద్ నగర్, డిసెంబర్12 : పెద్దరికం పక్కనపెట్టి అమానుషంగా దాడులు చేస్తూ కులం పేరుతో దూషించి హింసించడం తగదని ఇది చాలా అమానుషమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అందే బాబయ్య, షాద్ నగర్ తాలూకా అధ్యక్షులు మంగ వెంకటేశం ముదిరాజ్ అన్నారు. శుక్రవారం షాద్ నగర్ బీఆర్ఎస్ నాయకుడు దినేష్ సాగర్ ను షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం నాయకులు పరామర్శించారు. కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేటలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కుమారులు రవి యాదవ్ మురళి యాదవ్ తదితర అనుచరుల దాడి సమాచారం తెలుసుకున్న ముదిరాజ్ సంఘం నాయకులు ఈ సంఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌సంఘం పెద్దలు పద్మ కృష్ణయ్య ముదిరాజ్, తెలంగాణ ఉద్యమకారుడు మేకల వెంకటేష్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు శ్రీధర్ వర్మ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్, కొండ యాదయ్య ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, కిరణ్ ప్రసాద్ బాలరాజు సంఘం సభ్యులు తదితరులు దినేష్ సాగర్ ను ఆయన స్వగృహంలో పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ దాడులను ప్రజలు గమనిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులను తీవ్రంగా ముదిరాజ్ సంఘం ఖండిస్తుందని అన్నారు. న్యాయ పోరాటంతోనే సరైన సమాధానం చెబుతామని వారు తెలిపారు. ముదిరాజ్ కులం పేరిట దూషించారని ఇది సరైన పద్ధతి కాదని వారు హితవు పలికారు. పార్టీలకు అతీతంగా ముదిరాజులు అంతా ఏకం కావాలని ఈ సంఘటనను రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేలా చేయాలని వారు పిలుపునిచ్చారు. బీసీ సంఘాలు సైతం ముక్తకంఠంతో దీనిని ఖండించాలని వారు పిలుపునిచ్చారు. కులం పేరుతో దూషించడం పట్ల వారు మర్యాద దక్కదని హెచ్చరించారు.



గుర్రంపల్లి గ్రామ అభివృద్ధికి కృషి

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎమ్మెల్యేను సన్మానించిన సర్పంచ్ జంగయ్య



ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్12: గుర్రంపల్లి గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో పార్టీ నేత ఈరని జంగయ్యను సర్పంచ్ గా గెలిపించారని, ప్రజలు పార్టీపై ఉంచిన నమ్మకంతో గ్రామాభివృద్ధికి పూర్తిగా సహాయ, సహకారాలు అందజేస్తానని షాద్ నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ తెలిపారు. గుర్రంపల్లి సర్పంచ్ గా ఎన్నికైన ఈరని జంగయ్యతో పాటు ఉప సర్పంచ్ రజనీకాంత్ గౌడ్, వార్డు సభ్యులు కావలి బుచ్చయ్య, బూసం రమేశ్, సుందు బబ్బులు, మామిడిపల్లి నర్సింహులు గౌడ్, జిల్లెల్ల భీమయ్య, గ్రామ కాంగ్రెస్‌యువ యువకులు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తనను కలిసిన వారినందరిని పేరు పేరున పలకరించారు. అనంతరం జిల్లేడు, చౌదరి గూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజుతో కలిసి ఆయన సర్పంచ్ జంగయ్య, వార్డు సభ్యులకు శాలువా కప్పి సన్మానించారు. పార్టీ అభివృద్ధితో పాటు గ్రామంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు బండి గోపాల్, ఈరని చెన్నయ్య, ఈరని గోపాల్, బైరంపల్లి మల్లేశ, పులిమద్ది గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ కుట్రలకు తెలంగాణ చెక్

మొదటిపేజీ తరువాయి

శ్రీకారం చుట్టింది. కానీ, ఈ విషయం తెలిసా, ఈ కొత్త ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సుప్రీంకోర్టులో అభ్యంతరాలు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. తమ తరఫున వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని కోరింది.

మూడు దశలలో ప్రాజెక్టు

శనివారం పగలు అభిషేక్ మను సింఘ్వీతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమవుతారు. ప్రాజెక్ట్ పై చర్చిస్తారు. ఇటీవలనే పోలవరం నల్లమల సాగర్ డీపీఆర్ రూపకల్పన కోసం టెండర్లను పిలిచారు. అన్ని ఆధారాలతో సుప్రీంకోర్టులో పోరాటం చేయాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అటు పనులను త్వరలోనే మొదలు పెట్టాలని సీఎం చంద్రబాబు కూడా అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి వరద జలాలను బొల్లాపల్లి, నల్లమల సాగర్‌కు, అలాగే, నాగార్జున సాగర్ నుంచి 50 టీఎంసీల కృష్ణా వరద జలాలను బొల్లాపల్లికి తరలించాలని సూచించారు. ముందుగా ప్రతిపాదించిన గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ ను రూ.80,112 కోట్లతో ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం జల హారతి కార్పొరేషన్ ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ ప్రాజెక్ట్ ను మూడు దశలలో పూర్తి చేయాలనుకుంది. పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలోకి, అక్కడి నుంచి నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్‌లోకి తీసుకోనుంది. అక్కడ్నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించాలనేది ఏపీ సర్కార్ యోచన. వీటి కోసమే టెండర్లను ఆహ్వానించింది. కానీ, పలువైపుల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వెనక్కి తగ్గింది. పోలవరం నుంచి వరద జలాల తరలింపును బనకచర్ల వరకు కాకుండా నల్లమల సాగర్ వరకే పరిమితం చేయాలని నిర్ణయించింది.

తప్పుడు ప్రచారం చేస్తే తోలు తీస్తా

మొదటిపేజీ తరువాయి

క్షమాపణలు చెప్పిస్తానని స్పష్టం చేశారు. రాజకీయ భవిష్యత్తుపై ఇచ్చిన సంకేతాలు కూడా చర్చనీయాంశమయ్యాయి. 'దేవుడు కరుణించి నేను ముఖ్యమంత్రి అయితే 2014 నుండి జరిగిన ప్రతి అన్యాయం వెలికి తీస్తా. ఎవరు ఎంత పెద్దవారైనా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే' అని కవిత స్పష్టం చేశారు. 'నన్ను ఒకటి కొడితే రెండు కొడుతా, నాకు మహాత్మా గాంధీ అంత ఓపిక లేదు. ముందు గీత దాటింది వాళ్లే' అంటూ కవిత తెలంగాణ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు.

ఆడబిడ్డనని బెదిరిస్తే

'ఆడబిడ్డనని బెదిరిస్తే ఊరుకుంటుందని అనుకుంటున్నారేమో! కుదరదు బాస్. సామాన్య ఆడబిడ్డ చాకలి ఐలమ్మ ఎలా కొట్లాడిందో మనకు తెలుసు. ఆమె స్పిరిట్ తో నేను కూడా కొట్లాడుతాను. ఎవరేమన్నా ఊరుకోను. పదేళ్లలో నా భర్త గురించి ఎప్పుడైనా విన్నారా? చాలా అయ్యింది. ఇక ఊరుకోం' అని కవిత హెచ్చరించారు. 'ఒక ఆడబిడ్డగా 20 యేండ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్న. 19 యేండ్లుగా జాగృతి సంస్థను ప్రజాహితం, ప్రజల కోసం నడుపుతున్నా. జనం బాటలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్నాను. బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలకు సంబంధించిన అంశాలు ప్రజలు నా దృష్టికి తెస్తున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అక్రమాలు. దురాగతలు, దాష్టీకాలు బయటపడుతున్నాయి. ఏ మొహమాటం లేకుండా తెలంగాణ ఆడబిడ్డల పౌరుషంతో నేను వాటిని ప్రజలకు చెబుతున్నా. దీంతో చాలామంది అక్రమాల పుట్టలు, పాపాల పునాదులు కదులుతున్నాయి. అందుకే నేను కాంగ్రెస్ తో అంటకాగి ఉన్నానని, ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నాననే ప్రచారం మొదలు పెట్టారు. నేను జనంబాట కోసం బయటకు రావటంతో సోషల్ మీడియాలో ప్రచారం స్టార్ట్ చేశారు. ఏవీ రెడ్డి అనే వ్యక్తితో నా భర్త ల్యాండ్ లావాదేవీలు చేసి ఆర్థిక ప్రయోజనం పొందారంటూ క్యాంపెయిన్ చేస్తున్నారు. అలా నాకు కాంగ్రెస్ తో ఏదో అవినాభావ సంబంధం ఉందన్నట్లు ప్రయత్నం చేస్తున్నారు. ఈ వెకిలి ప్రయత్నాలు చేసే గుంట నక్కలను హెచ్చరిస్తున్నా. నేను ఇంకా మీ బాగోతాలు బయట పెట్టటం స్టార్ట్ చేయలేదు. ఇప్పుడు టాస్ మాత్రమే వేశా. ఇంకా టెస్ట్ మ్యాచ్ ముందుంది' అని కవిత హెచ్చరించారు.

అధికారాన్ని వాడుకోలేదు

'బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నేను గానీ నా భర్త గానీ ఏదైనా ఫేవర్ అడిగామా? కేసీఆర్ ను, కేటీఆర్, హరీశ్ రావు ను మేము ఏదైనా ప్రయోజనం అడిగితే చెప్పమనండి. శ్ ఊరుకుంటూ ఉంటే వెకిలి ప్రయత్నాలు చేస్తున్నారు. మొరిగే వాళ్లు మొరిగితే నేను ఊరుకోను. సిగ్గు ఉంటే నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి. బీఆర్ఎస్ లో పైసా ప్రయోజనం మేము పొందలేదు. నీతి, నిజాయితీ ఉంది. కనుకే కుండ బద్దలు కొట్టి మాట్లాడుతున్నా. నాకు ఏ పార్టీతో, ఎవరితో అండర్ స్టాండింగ్ లేదు. మీ లెక్క ఉద్యమం పేరు చెప్పి వసూళ్లకు మేము పాల్పడలేదు. ఏయే స్టూడియోల ముందు ధర్నాలు చేసి ఎలా వసూలు చేశారో చెబితే సిగ్గు పోతుంది. అమెరికా నుంచి రాగానే నేను ఉద్యమంలో నా భర్త వ్యాపారంలో ఉన్నారు. నేను ఉద్యమంలో నా నగలు కుదవ పెట్టి ఉద్యమం చేశాను. అందుకే నాకు అంత పౌరుషం. ఇంకా నేను మీ చిట్టాను తెరవనే లేదు. నా మీద తప్పుడు కథనాలు ప్రసారం చేసిన టీ న్యూస్ కు నోటీసులు ఇస్తున్నా. కథనం ప్రసారం చేసే ముందు కనీసం తెలుసుకోరా? నేను ఎట్టి పరిస్థితులో ఊరుకోను. పబ్లిక్ గా వారం రోజులలో క్షమాపణలు చెప్పాలి. లేదంటే కోర్టు ద్వారా క్షమాపణలు చెప్పిస్తాం' అని కవిత స్పష్టం చేశారు.

తప్పు చేయకుంటే భయమెందుకు

'ఆడపిల్ల బయటకు వచ్చి అన్ని మాట్లాడుతుంటే భయమవుతుందా? నేను భయపడే పిరికి పందను కాదు. అన్ని ట్రాన్స్ పరెంట్ గా సమాధానం చెబుతా. నా మీద వచ్చిన ఆరోపణలకు నేను వివరణ ఇస్తున్నా. మీరు కూడా మీ మీద వచ్చిన అన్ని ఆరోపణలకు సమాధానం చెప్పండి. నా భర్త మీద చేసిన ఆరోపణలకు సంబంధించి అన్ని వివరాలు చెబుతా. రెండు సర్వే నంబర్లకు సంబంధించి ల్యాండ్ అది. 2010/2, 2010/ 3 అనే సర్వే నంబర్ లో ఉన్న ల్యాండ్ కు 1975 నుంచి కూడా పట్టాలు, పాస్ బుక్కులు ఉన్నాయి. అది పూర్తిగా ప్రైవేట్ ల్యాండ్. మొత్తం 16 ఎకరాలైతే వారి నలుగురు కొడుకులకు 4 ఎకరాలు వచ్చాయి. అక్కడే టేకం షా అనే కంపెనీకి 35 ఎకరాలు ప్రైవేట్ వ్యాపారుల ల్యాండ్ ఉంది. ఏదైతే 16 ఎకరాల భూమి ఉందో అందులో నా భర్త వేరే వాళ్లు ఉన్నారు' అని కవిత వివరించారు.

రాష్ట్రంలో చలి తీవ్రత

మొదటిపేజీ తరువాయి

రెండు నుంచి మూడు డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయినట్లు వాతావరణ అధికారిణి శ్రావణి తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో చలి ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది. మరో రెండు రోజులపాటు శీతల, అతి శీతల పవనాలు వీచే అవకాశం ఉన్నందున ఉత్తర, పశ్చిమ, ఈశాన్య జిల్లాలకు ఎల్లో అలర్ట్ లు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎల్లుండి నుంచి పొగ మంచు పెరిగే అవకాశం ఉందన్నారు. శీతల గాలులు, పొగ మంచు వల్ల ప్రజలపై చలి తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. దీంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రత : రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రధానంగా మన్యం జిల్లాలు గజగజ వణుకుతున్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు రికార్డు స్థాయిలో కనిష్ఠంగా 5.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ చలి తీవ్రత అధికంగా ఉంది.

13 జిల్లాల్లో 8 డిగ్రీల లోపే..

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 13 జిల్లాల్లో ఏకంగా 8 డిగ్రీల లోపే నమోదు కావడం తీవ్రతను తెలుపుతోంది. దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి గాలులు తెలంగాణ వైపునకు వీస్తున్న కారణంగా చలి తీవ్రత కొనసాగుతోందని వాతావరణ శాఖ తెలిపింది. సాధారణం కన్నా 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించింది. జనగామ మినహా అన్ని జిల్లాల్లోనూ 10 డిగ్రీల లోపు రాత్రిపూట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని సూచించింది. రాష్ట్రంలో ఉన్న 32 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

'సిట్' ముందు లొంగిపోయిన మాజీ ఐజీ

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన విషయం తెలిసిందే. దాని తర్వాత వచ్చిన రిపోర్టుపై మళ్లీ విచారణ చేస్తామని ఈ సందర్భంగా పేర్కొంది. చట్ట ప్రకారం దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈక్రమంలోనే ప్రభాకర్‌రావు ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట హాజరయ్యారు.

ఈ కేసులో పలు ఆరోపణలు

ప్రభాకర్‌రావును కస్టోడియల్ దర్యాప్తు చేసేందుకు అనుమతించిన ధర్మాసనం, ఆయనకు భౌతికంగా ఎలాంటి హాని లేకుండా చూడాలని అధికారులను ఆదేశించింది. వారం రోజుల పాటు జరిగే ఈ కస్టోడియల్ విచారణలో ఇంటి నుంచి భోజనం, ఆరోగ్యానికి సంబంధించిన మందులను తీసుకునేందుకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో రాజకీయ పార్టీల అగ్రనాయకులను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అంశం మొదట తీవ్ర కలకలం రేపింది. దీనిపై ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో నిందితులైన పోలీసు ఉన్నతాధికారులపై పలు కేసులు నమోదు చేసింది. వారిలో ప్రభాకర్‌రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న, ప్రణీత్ రావు ఉన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్‌రావుపై ఈ కేసులో పలు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీస్ శాఖ ఇప్పటికే దర్యాప్తు చేపట్టింది. అందులో భాగంగా ఫోన్‌లు ట్యాప్ అయిన నేతలు ఈటల రాజేందర్, మహేశ్ కుమార్ గౌడ్, బండి సంజయ్ తదితర నాయకులను పిలిచి వాంగ్మూలం తీసుకుంది. సిట్ విచారణను ముమ్మరం చేసింది. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావు సిట్ ఎదుట లొంగిపోయారు.

రేవంత్ పాలనా వైఫల్యంపై ప్రజలు విసిగిపోయారు

మొదటిపేజీ తరువాయి

పల్లెల్లో పైసా అభివృద్ధి పని జరగదని, గ్రామస్థులు నిర్ధారణకు రావడం వల్లే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇంతటి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయన్నారు. సగం స్థానాలు కూడా కాంగ్రెస్ గెలవకపోవడం, అనేక చోట్ల 10, 20 ఓట్ల తేడాతోనే బయటపడటం చూస్తే కాంగ్రెస్ కు కౌంట్ డౌన్ పల్లెల నుంచే ప్రారంభమైనట్టు స్పష్టంగా అర్థమైపోతోందన్నారు. రెండేళ్లు గడిచినా ఆరు గ్యారెంటీల పేరిట చేసిన సీఎం రేవంత్ మోసం, పెన్షన్ల పెంపు పేరిట చేసిన ద్రోహం, మహాలక్ష్మి పేరిట చేసిన దగా, తులం బంగారం పేరిట చేసిన నయవంచనను గ్రామీణ ప్రాంత ప్రజలు మరిచిపోలేదని పంచాయతీ ఎన్నికల ఫలితాలు తేల్చిచెప్పాయని కేటీఆర్‌తెలిపారు. యూరియా బస్తాల కోసం నెలల తరబడి పడిన అగచాట్లను, బోనస్ పేరిట చేసిన బోగస్ హామీని, చివరికి పండించిన పంటను అమ్ముకోలేక పడ్డ కష్టాలను అన్నదాతలు గుర్తు పెట్టుకున్నారని అన్నారు. పదేళ్లపాటు ప్రగతిపథంలో సాగిన పల్లెల్లో రెండేళ్లుగా పడకేసిన పాలన, గాడితప్పిన పారిశుధ్యం, చివరికి ట్రాక్టర్లలో డిజిల్ పోయలేని దుస్థితి వంటి అంశాలన్నీ పల్లె ప్రజలను ఆలోచింపజేశాయని అన్నారు. ఇది ఆరంభం మాత్రమే, పంచాయతీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం రానున్న రోజుల్లో పాతాళానికి పడిపోవడం ఖాయం. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యం అని అన్నారు.

జర్మనీతో సుదీర్ఘ స్నేహబంధం

మొదటిపేజీ తరువాయి

వివరించారు. సీనియర్ పోలీసు అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ సెల్ ఏర్పాటు చేశామని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో ప్రత్యేకంగా రెండు ఫ్లోర్లు సైబర్ సెక్యూరిటీ కోసం కేటాయించామని వివరించారు. జిల్లాల్లో కూడా సైబర్ సెక్యూరిటీ బృందాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆర్థిక నేరాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని, ఫైనాన్స్ రంగంలో సైబర్ ఫిషింగ్ ఎలా జరుగుతుంది, వాటిని అరికట్టేందుకు బెస్ట్ ఏఐ టూల్స్ వాడుతున్నట్టు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని జర్మనీ పార్లమెంటు బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించింది. ప్రతి రంగంలో సాధించాల్సిన లక్ష్యాలను ఈ విజన్ డాక్యుమెంట్ లో స్పష్టంగా పేర్కొనడం అభినందనీయమని, రాష్ట్ర



ప్రగతి పట్ల మీ నిబద్ధత ఈ డాక్యుమెంట్ ద్వారా స్పష్టంగా తెలుస్తుందని జర్మనీ పార్లమెంట్ బృందం అభిప్రాయపడింది.

సైబర్ సెక్యూరిటీ, స్కిల్ లేబర్ అంశాలలో

సైబర్ సెక్యూరిటీ, స్కిల్ లేబర్ అంశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం కోరుకుంటున్నామని జర్మన్ పార్లమెంట్ బృందం వివరించింది. జర్మనీకి చెందిన పెట్టుబడిదారులు చాలామంది భారతదేశంలో పెట్టుబడులు పెట్టారని, తమ దేశానికి చెందిన బోష్‌వంటి ప్రసిద్ధ కంపెనీలు ఇక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నాయని, తమ దేశానికి చెందిన ఇంజనీర్లు భారత దేశంలో, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్నారని జర్మనీ పార్లమెంటు బృందం పేర్కొంది. భారతదేశానికి చెందిన 60 వేల మంది విద్యార్థులు జర్మనీలో వివిధ రకాల కోర్సులను అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు, స్కిల్డ్ లేబర్ కు భారతదేశం, తెలంగాణ రాష్ట్రంలో కొదవలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎండీ కృష్ణభాస్కర్, జెన్కో సిఎండి హరీష్, ప్రణాళిక శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్‌జ్యోతి, అసెంబ్లీ సెక్రెటరీ నర్సింహా చార్యులు తదితరులు హాజరయ్యారు.



ఏడాది పొడవునా విమాన టికెట్ ఛార్జీలను కేంద్రం కంట్రోల్ చేయలేదు. కొవిడ్ 19, ఇటీవల ఇండిగో వంటి సంక్షోభాల్లోనే మనం నియంత్రించగలం. కొన్ని సీజన్స్, ఫెస్టివల్స్ సమయంలో టికెట్ ధరలు కాస్త పెరుగుతాయి. సంస్థలే వాటిని నియంత్రిస్తాయి. మార్కెట్ సప్లయ్, డిమాండును అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

- లోక్‌సభలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజనపై ఫిర్యాదుల వెల్లువ

- రెండు రోజుల్లో స్థానికుల నుంచి 320 ఫిర్యాదులు
- -హద్దులను స్వల్పంగా సవరించేందుకు బల్దియా అంగీకారం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్12: డివిజన్ల పునర్విభజనకు సంబంధించి జీహెచ్ఎంసీకి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల్లోనే ఏకంగా 320 వరకు స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. కొత్త హద్దులతో కూడిన పటాలు ఇవ్వకుండా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఆహ్వానించడం ఏంటని బీజేపీ, ఎంఐఎంలతో పాటు అధికార పార్టీ కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో బల్దియా అధికారులు ఓ కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో డివిజన్ల హద్దుల వివరాలతో పాటు మరికొంత సమాచారాన్ని అందుబాటులోకి ఉంచాలని నిర్ణయించారు. మరోవైపు కొన్ని డివిజన్ల పేర్లు, హద్దులను మార్చాలని గురువారం ఉన్నతాధికారులు ఏకాభిప్రాయానికొచ్చారు.

పునర్విభజన సరిగా కాలేదు...

బల్దియా అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోకుండా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను విభజించారని, డివిజన్‌కు పక్కనే ఉన్న గగన్‌పహాడ్ గ్రామాన్ని 5 కి.మీ. దూరంలోని రాజేంద్రనగర్ డివిజన్‌లో కలిపారంటూ మైలార్‌దేవ్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు ధనుంజయ కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. తమ డివిజన్‌లో గతంలో లక్ష జనాభా ఉండేదని, ఇప్పటికీ 70 వేల జనాభాతో ఉంచేశారని, పునర్విభజన సరిగా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీరాలం చెరువుకు దిగువ భాగంలో ఉండే ప్రాంతాలకు, నేషనల్ హైవేకు అవతలి వైపు ఉన్న కాలనీలను కలిపి కిషన్‌బాగ్ డివిజన్‌ను ఏర్పాటు చేశారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ విషయంలో మాత్రం జాతీయ రహదారిని హద్దుగా తీసుకున్నామనే అధికారుల తీరుపై నిరసన చేపడతామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శివరాంపల్లి ప్రాంతాన్ని సులేమాన్‌నగర్ డివిజన్‌లో కలపడంపై స్థానికులు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని లలితాబాగ్ డివిజన్, యాకుత్‌పుర నియోజకవర్గంలోని హరిబౌలి, చార్మినార్ నియోజకవర్గంలోని డివిజన్ల హద్దులు, పేర్లను మార్చాలంటూ ఎంఐఎం నేతల నుంచి బల్దియాకు 18 ఫిర్యాదులందాయి. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట, ఎల్బీనగర్‌లోని హైకోర్టుకాలనీ, ఉప్పల్‌లోని చక్రిపురం కాలనీల పేర్లను మార్చాలని నేతలు కోరుతున్నారు. దాదాపు 20 డివిజన్లకు 60-80వేలు, కనిష్ఠంగా 20వేలు గరిష్ఠంగా 80వేల జనాభాతో సరిహద్దులను నిర్ణయించారు.

16న పాలకమండలి సమావేశం

డివిజన్లలో కొన్ని ప్రాంతాల విలీనంపై చర్చించేందుకు, కార్పొరేటర్ల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈనెల 16న పాలకమండలి సమావేశం నిర్వహించనున్నారు. కార్పొరేటర్ల అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేస్తామని అధికారులు చెబుతున్నారు. డిసెంబరు 17తో అభ్యంతరాలపై గడువు ముగియనుంది. 18న డివిజన్ల పునర్విభజనకు తుది ఆమోదం తెలపాలని బల్దియా లక్ష్యంగా పెట్టుకుంది. చార్మినార్ జోన్‌లోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ సరిగా జరగలేదంటూ అక్బరుద్దీన్ ఒవైసీతోపాటు ఇతర ఎంఐఎం ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ బేగ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా, సూచనలు తీసుకోకుండానే హద్దులను నిర్ణయించారంటూ వారు అభ్యంతరం తెలిపారు. క్షేత్రస్థాయిలో తిరిగితేనే బౌండరీలు తెలుస్తాయని, గూగుల్ పటాలను చూస్తూ ఆన్‌లైన్‌లో డివిజన్ల హద్దులను నిర్ణయించినట్లయితే సమస్యలు తప్పవని ఓ నేత కమిషనర్‌ను కలిసిన అనంతరం తెలిపారు. ఇతర రాజకీయపార్టీల నేతలు కూడా బల్దియాకు వరుస కట్టారు. బల్దియా ప్రధాన కార్యాలయం, జడ్సీ, సర్కిల్ కార్యాలయాల్లో పలు ఫిర్యాదులు అందాయి.



సదర్‌ను రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయం

- యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్
- సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్12: యాదవులకు ఎంతో ఇష్టమైన సదర్ ను రాష్ట్రప్రభుత్వ పండుగగా గుర్తిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ప్రశంసించారు. దేశంలోని యాదవ సమాజం రేవంత్ రెడ్డిని ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ఆయన అన్నారు. యాదవుల హృదయంలో రేవంత్ రెడ్డి ఉండిపోతారని అఖిలేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తెలంగాణలోని యాదవ వర్గానికి రాజకీయంగా మంచి గుర్తింపు ఇస్తున్నందుకు ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో జూబ్లీ హిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అఖిలేష్ యాదవ్ తాజా రాజకీయ పరిస్థితుల పైన చర్చించారు. తెలంగాణ లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్ కు సీఎం రేవంత్ వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎంఎల్ ఏ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నేత రోహిన్ రెడ్డి ఉన్నారు.

రూపాయి విలువ పడిపోవడం ఆందోళనకరం

- దేశ ప్రజలుతీవ్ర అస్థిరపరిస్థితులు ఎదుర్కొంటున్నారు
- పార్లమెంటులో ప్రజాసమస్యలపై ప్రస్తావించడం లేదు: ఎంపీ వంశీక్రిష్ణ



ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, డిసెంబర్12: దేశం ప్రస్తుతం తీవ్ర అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటుందని, ప్రజలకు నేరుగా ప్రభావం చూపే అంశాలు పార్లమెంటులో చర్చకురాకపోవడం, అనవసరమైన విషయాలు చర్చించడం దారుణమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ అన్నారు. డిల్లీలో ఆయన మట్లాడుతూ మూడు సార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. రూపాయి విలువ పడిపోవడం దారుణమని పేర్కొన్నారు. డీజీసీఏ కొత్త నిబంధనలు అమలులోకి వచ్చిన రెండు సంవత్సరాలు అవుతున్నా ఇండిగో మాత్రం నిర్లక్ష్యం చేసిందని, ప్రయాణికుల భద్రతకు సంబంధించి అంశంపై చర్చ తప్పనిసరి అని, దీని కూడా పట్టించుకోలేదన్నారు. అదే విధంగా ఢిల్లీలో కాలుష్యం ప్రమాద స్థాయికి చేరి ప్రజల అనారోగ్యం ప్రమాదంలో పడుతుండగా దీనిపై కూడ ప్రభుత్వం మౌనం వహిస్తుందని మండిపడ్డారు. రూపాయి విలువ ఐసీయూలో ఉన్నట్టు ఉందని, నిరుద్యోగం రోజు రోజుకూ పెరిగిపోతుందని, సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలన్న కేంద్రం ఉద్యోగాల ఊసెత్తడం లేదన్నారు. పార్లమెంటులో 150 సంవత్సరాలకాలం క్రితం జరిగిన అంశాలపై చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి మంచికాదన్నారు. తమ నేత రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇవ్వకుండా దారి మళ్లించడం సరికాదన్నారు. ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడిగా, దేశ పౌరుడిగా ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యలను ప్రతిపాదించడమే తన ప్రధాన కర్తవ్యమని తెలిపారు.



తెలంగాణలోనూ పరిస్థితులు మారుతాయి

- సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్12: తెలంగాణలోనూ పరిస్థితులు మారుతాయని, ప్రజలు మారుతారని ఆశిస్తున్నామని, దేశం ప్రగతిశీల మార్గంలో వెళ్లే అవసరం ఉందని సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుతో సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సమావేశమయ్యారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ ఇంటికి వచ్చిన అఖిలేష్‌కు కేటీఆర్, హరీశ్‌రావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు పలు అంశాలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ త్వరలోనే అఖిలేష్ యాదవ్ కేసీఆర్‌తో సమావేశం అవుతారన్నారు. హైదరాబాద్ వచ్చిన అఖిలేష్ యాదవ్‌కు తాము స్వాగతం పలికుతామంటే స్వయంగా వచ్చి కలుస్తానన్నాని, చర్చిస్తానన్నారు. కేసీఆర్ ఇంటికి వచ్చి తమ సమయం గడిపి ఆతిథ్యం స్వీకరించారన్నారు. తమతో సమయం గడిపినందుకు అఖిలేష్ యాదవ్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. గతంలో శాసనసభలో అధికారం కోల్పోయిన తర్వాత పార్లమెంట్ లో తక్కువ సీట్లు సాధించినా.. ప్రజల వెంబటి నిలబడినందుకు అఖిలేష్ యాదవ్ పార్టీ ఇప్పుడు 37 మంది ఎంపీలను గెలిపించుకొని దేశంలోని మూడవ అతిపెద్ద పార్టీగా నిలిచిందన్నారు. అఖిలేష్ పార్టీ స్ఫూర్తితో భారత రాష్ట్ర సమితి కూడా భవిష్యత్తులో ముందుకు సాగుతామన్నారు. ప్రజల వెంట నిలబడి మరోసారి తప్పకుండా ప్రజల ఆశీర్వాదాలు పొందుతామన్నారు. అఖిలేష్ యాదవ్ పార్టీ 2024లో 37 మంది ఎంపీలతో ఢిల్లీకి తిరిగి వచ్చినట్లు.. తాము కూడా సమాజ్ వాదీ పార్టీ నుంచి స్ఫూర్తి పొందుతామన్నారు. మళ్లీ బౌన్స్ బ్యాక్ అవుతామని.. మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తామన్నారు. అనంతరం అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎప్పుడు కలిసినా చాలా ఆప్యాయంగా, సొంత మనిషిలా అనిపిస్తుందన్నారు. హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా కలిశానని.. బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎప్పుడూ గౌరవంతో స్వాగతం పలికారన్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ ఒడిదుడుకులు ఉంటూనే ఉంటాయని.. రాజకీయాల్లో ప్రజలు ఒక్కోసారి స్వీకరిస్తారని.. మరోసారి మన విషయాలను పునఃపరిశీలించుకునే అవకాశం ఇస్తారన్నారు. తాము మాట్లాడుకున్న సమయంలో ఇదే అంశంపై చర్చించామన్నారు. ఒకప్పుడు తాము తక్కువ సీట్లు గెలిచామని.. కానీ అదే ప్రజలు మళ్లీ తమ వెంట నిలిచారన్నారు. అక్కడ బీజేపీ రెండో స్థానంలో ఉందని.. మనం ప్రజల వెంట నిలబడినప్పుడు ఏదో ఒక రోజు ప్రజలే మన పార్టీల వెంట నిలబడతారని, అండగా ఉంటారన్నారు. తెలంగాణలోనూ పరిస్థితులు మారుతాయని ప్రజలు మారుతారని ఆశిస్తున్నామని.. దేశం ప్రగతిశీల మార్గంలో వెళ్లే అవసరం ఉందన్నారు. ఒక విజన్‌తో ముందుకు వెళ్లాలని.. విభజన రాజకీయాలు అంతం కావాలన్నారు. రాజకీయాల్లో ప్రతికూలత పోవాలని, సానుకూల మాటలు ఉండాలన్నారు. సానుకూలత రావాలని, ప్రగతి గురించి చర్చ జరగాలన్నారు. అదే దిశలో పని చేయడానికి తమ ప్రయత్నం ఉంటుందన్నారు. కేసీఆర్‌తోనూ మాట్లాడానని.. త్వరలోనే వచ్చి ఆయనను కలుస్తానన్నారు.



గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు భారీగా సందర్శకులు

- ఆసక్తికరంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ అంశం పై సదస్సు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబరు 12: ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో కొనసాగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు మూడవ రోజు శుక్రవారం వేలాది మంది తో కిటకిటలాడింది. "రియల్ లైఫ్‌లో రిజిలియెన్స్" అనే అంశంపై ప్రారంభమైన నేటి సెషన్ కు నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చలో, వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో రిజిలియెన్స్ యొక్క ప్రాముఖ్యత, వ్యక్తిగత, వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కోవడం, కొత్త మార్పులకు త్వరగా అలవాటు పడే నాయకత్వ నైపుణ్యాలు, ఏఐ, ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో భవిష్యత్ సిద్ధత, యువతలో గ్రోత్ మైండ్ సెట్, సమస్య పరిష్కార దృష్టికోణాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ సదస్సులో ఆధార్‌మాజీ చైర్మన్ జి. సత్యనారాయణ, మాస్టెక్ డిజిటల్ చీఫ్ డెలివరీ ఆఫీసర్ జితేంద్ర పుచ్చ, అవికా సీటీవో శ్రీనివాస్ అత్రేయ, క్వీలీస్ సీఈఓ కిషోర్ ఉప్పలపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్,, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చేదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు, డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు.



మల్కాపూర్ పెద్ద చెరువు వద్ద ఇన్‌ఫాంట్రీ కంబాట్ వెహికల్స్ ఫ్లోటేషన్ ట్రయల్స్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 12 : మెదక్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, సంగారెడ్డిలోని ఎద్దు మైలారం లోని ఆయుధ కర్మాగారంలో దేశీయంగా తయారు చేయబడిన ఇన్‌ఫాంట్రీ కంబాట్ వెహికల్స్ వార్షిక ఫ్లోటేషన్ ట్రయల్స్‌ను నిర్వహించింది. ఈ ట్రయల్స్ 2025 డిసెంబర్ 12న మల్కాపూర్ సరస్సు (పెద్ద చెరువు) వద్ద మెదక్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.ఎస్. ప్రసాద్ పర్యవేక్షణలో జరిగాయి. డిజిక్యూ ఏ సంస్థలు, యూజర్ డైరెక్టరేట్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఏటా నిర్వహించబడే ఫ్లోటేషన్ ట్రయల్స్, ఐసివి ల యొక్క ఉభయచర సామర్థ్యం భూభాగనిర్వహణ పనితీరును ధృవీకరించాయి, విభిన్న యుద్ధభూమి పరిస్థితులలో వాటి విశ్వసనీయతను నిర్ధారిస్తాయి. 1984లో స్థాపించబడిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, బి ఎం పి 2, ఐఐకే, సిఎంటి, ఏ ఈ ఆర్ వి, ఏఏటి, సిసిపిటి, ఎన్ బి సిఆర్ వి, భారత సైన్యం మోహరించిన ఇతర ప్రత్యేక వేరియంట్ లతో సహా విస్తృత శ్రేణి పదాతిదళ పోరాట వాహనాలను ఉత్పత్తి చేయడానికి అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రీమియం తయారీ యూనిట్. ఈ ఫ్యాక్టరీ వివిధ పారామిలిటరీ దళాలు మరియు రాష్ట్ర పోలీసు విభాగాలకు సి ఆర్ ఎన్91 (నావల్ అప్లికేషన్ల కోసం), ఎం పి వి /ఎం ఎం పి విలు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కూడా ఉత్పత్తి చేసి సరఫరా చేసింది. ఈ ట్రయల్ రన్ చూడటానికి చుట్టూ పక్కల గ్రామాల నుండి ప్రజలు భారీగా తరలి వచ్చి ఆనందించారు.

ప్రభుత్వాలు మారినా పనులు ఆగకూడదు

- జాగృతి జనంబాటలో కవిత ధ్వజం
- అంబర్‌పేట్, మలక్‌పేట్, సికింద్రాబాద్ పర్యటన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 12: ప్రభుత్వాలు మారినా ప్రజల పనులు ఆగకూడదు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లో అంబర్‌పేట్, మలక్‌పేట్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, నిలిచిపోయిన రోడ్లు-బ్రిడ్జులు, పాతబడిన విద్యా సంస్థల భవనాలు, శిథిలావస్థలో ఉన్న బస్తీవాసుల ఇళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా విమర్శించారు. పేదవారి ఇళ్ల నుండి బ్రిడ్జి నిర్మాణాల వరకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో చేపట్టిన జాగృతి జనంబాట మూడో రోజు పర్యటన అంబర్‌పేట్, మలక్‌పేట్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో కొనసాగింది. ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ఈ యాత్రను ప్రారంభించినట్లు కవిత తెలిపారు. పేదవారి కాలనీలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, సంవత్సరాలుగా నిలిచిపోయిన రోడ్డు-బ్రిడ్జి పనులు, విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను విపులంగా అధ్యయనం చేశారు. అంబర్‌పేట్‌లోని కాచిగూడ జూనియర్ కాలేజ్, స్కూల్‌ను పరిశీలించిన ఆమె, 60 ఏళ్ల క్రితం నిర్మించిన అదే పాత భవనంలో ఇప్పటికీ విద్య కొనసాగుతున్నదుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త భవనానికి నిధులు వచ్చినప్పటికీ వాటిని వినియోగించకపోవడం, లైబ్రరీ, కంప్యూటర్ల వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం, పేదవారి పిల్లలు మధ్యాహ్న భోజనం కోసం బయటికి వెళ్లి తిరిగి రాని పరిస్థితుల వల్ల పాస్ శాతం పడిపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే జాగృతి సంస్థ ద్వారానే మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని కవిత ప్రకటించారు. అంబర్‌పేట్ చే నంబర్ బ్రిడ్జి కింద రోడ్డు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండగా, తాము పరిశీలనకు వస్తున్నట్లు ప్రకటించగానే రాత్రికి రాత్రే రోడ్డు వేసిన దాన్ని కవిత విమర్శించారు. "ఇంత వేగంగా పని చేయగలిగితే ప్రజలు చెప్పినప్పుడే లేదా అధికారులు చూసినప్పుడే ఎందుకు చేయలేదు?" అని ప్రశ్నించారు. అలాగే మలక్‌పేట్ -అంబర్‌పేట్‌ల మధ్య మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన హై లెవల్ బ్రిడ్జి పనులు ప్రభుత్వం మారగానే ఆగిపోయాయని ఆమె తీవ్రంగా వ్యాఖ్యానించారు. అంబర్‌పేట్‌లో ట్రాఫిక్ పెరుగుదల దృష్ట్యా మరో బ్రిడ్జి కూడా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. మూసీ నదిపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత లోపాలున్నాయని, ఇటీవల వరదలలో స్తంభాలు-సలకలు కుంగిపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని కవిత అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అడ్డగుట్ట, సీబీఎన్ నగర్, మాణికేశ్వర్ నగర్ బస్తీల్లో పర్యటించిన కవిత, రోజువారీ కూలీలు ఎక్కువగా నివసించే ఈ ప్రాంతాల్లో ప్రభుత్వం కనీస దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. సీబీఎన్ నగర్ బస్తీలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇండ్లపై కప్పులు ఊడి పడుతున్నా, ప్రజలు ప్రాణాపాయ పరిస్థితిలో జీవిస్తున్న దృశ్యాలను చూసి వెంటనే కొత్త ఇండ్లు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బస్తీవాసులు రూ.70 లక్షలతో కొనుగోలు చేసిన స్థలం కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంతో వినియోగించబడలేదని ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో చెప్పినట్టుగా ఇక్కడి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు తక్షణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ గురుద్వారాను సందర్శించిన కవిత, సిక్కు పెద్దలతో కలిసి పూజలు నిర్వహించారు. ప్రజల అసలు సమస్యలను వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ధోరణితో జాగృతి జనంబాటను కొనసాగిస్తామని ఆమె తెలిపారు.



సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా నవీన్ యాదవ్ ప్రచారం

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 12 : రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, బకారం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఎలిగేపల్లి శ్రీనివాస్ యాదవ్ తరపున జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఎలిగేపల్లి శ్రీనివాస్ యాదవ్ గ్రామాభివృద్ధి పట్ల చూపుతున్న పట్టుదల, సేవాభావం, ప్రజలతో కలిసికట్టుగా పనిచేసే తీరును ప్రశంసించారు. గ్రామ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారాలు చూపుతున్న నాయకత్వ గుణాలు శ్రీనివాస్‌లో ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తుచేస్తూ, గ్రామ అభివృద్ధి మరింత వేగంగా సాగేందుకు బకారం ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎలిగేపల్లి శ్రీనివాస్ యాదవ్ కత్తెర గుర్తు పైన మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించి గ్రామ అభివృద్ధి కి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి. అనిల్ . మహేందర్ ముద్దిరాజ్. నరహరి బంది. రాములు. మహిళల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయ్‌కు -నాకు -కర్నూలుకు ఓ అనుబంధం ఉంది. నేను 1993లోనే ఢిల్లీ వెళ్లడంతో వాజ్‌పేయ్‌తో పరిచయమైంది. 2018లో వాజ్‌పేయ్ కీర్తిశేషులయ్యాక ఆయన అస్థికలను ఢిల్లీ నుంచి తెచ్చి నా చేతుల మీదుగా పవిత్ర తుంగభద్ర నదిలో కలిపే అవకాశం దక్కింది. వాజ్‌పేయి చూపిన బాటలోనే ప్రధాని మోడీ దేశాన్ని సుస్థిర అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారు.
- ఏపీ మంత్రి సత్యకుమార్

ఓపెన్ వాయిస్

కొనసాగుతున్న ఆర్థిక అసమానతలు

దేశ ఆదాయంలో 58 శాతం ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10 శాతం వారికే దక్కుతోంది. భారత్‌లోని 40 శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద ఉంది. భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాలలో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాలలోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94 శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాలలో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం 2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు అసమానతలు తగ్గిన దేశాలలో నివసిస్తున్నారు. నాలుగింట ఒక వంతు మంది 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాలలో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాలలో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాలలో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారన్న వాదన ఎన్నో యేండ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు. ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10 శాతం వర్గం సుమారు 65 శాతం సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది. ఆదాయ అసమానతలు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58 శాతం ఉన్నతవర్గంలో ఉన్న టాప్ 10 శాతం వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న 50 శాతం వర్గం వారికి దేశ ఆదాయంలో 15 శాతం మాత్రమే దక్కుతోంది. 2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్ 10 శాతం వర్గం, బాటమ్‌లోని 50 శాతం వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేండ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి. భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28 వేల యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7 శాతం మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది. మొత్తంగా దేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలు స్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది. 140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు.

ప్రతిపక్షం
హైదరాబాద్,
శనివారం
13.12.2025

వెలుగు చూడని యోధురాలు నీరా ఆర్యా

'జైలర్ కోపంతో, అప్పుడు మేము నేతాజీని మీ హృదయం నుండి తొలగిస్తామని అన్నాడు. జైలర్ నన్ను అనుచితంగా తాకాడు, అసభ్యంగా ప్రవర్తించాడు. ఛాతీ ప్రాంతంలో నా వస్త్రాన్ని చీల్చమని కమ్మరిని సూచించాడు. కమ్మరి దానిని కత్తిరించడానికి నా కుడి రొమ్మును నొక్కడం ప్రారంభించాడు. భాదతో విలవిలలాడాను. జైలర్ 'కత్తి పదునుగా లేనందువల్ల బతికి పోయావు' అంటూ వదిలేశాడు' అని నీరా ఆర్య తన బాధలను వివరించింది. నీరా ఆర్య వంటి సమరయోధుల వంటి కథలు చాలా ఉన్నాయి. వారు ఈ దేశానికి దోహదపడ్డారు. దురదృష్టవశాత్తు, పాఠ్యపుస్తకాలలో గుర్తింపు పొందలేదు.




సుధాకర్ ఏవీ
9000674747

1998 జూలై నెల, హైదరాబాదులోని పాతబస్తీ ఫుట్ పాత్ మీద పువ్వులమ్ముకొని బతుకుతున్న వృద్ధురాలికి సుస్తి చేసింది. తోటి వాళ్లు ఆసుపత్రిలో చేర్పించగా కొన్నాళ్లకే ఆమె కన్ను మూసింది. మృతదేహాన్ని అప్పగించడానికి ఆమె గురించి ఆరాతీస్తూ గుడిసెలోనికి వెళ్లిన అధికారులకు ఒక పాత ట్రంకు పెట్టె కనిపించింది. ఇందులోని కాగితాలు చూసి వారు నిర్ఘంతపోయారు. ఆమె ఎవరంటే, ఉత్తర్ ప్రదేశ్ లోని కేకరానగర్ కు చెందిన నీరా ఆర్య. రాణి ఝాన్సీ రెజిమెంట్‌కు చెందిన నిర్భయ సభ్యురాలు నీరా ఆర్య, బ్రిటిష్ పాలనను ధిక్కరించి, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను రక్షించడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసింది. జైలులో పెట్టబడి, హింసించబడిన ఆమె, తన సహచరులకు ద్రోహం చేయడానికి నిరాకరించింది. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో మొదటి మహిళా గూఢచారిగా ఆమె ధైర్యసాహసాలు ఆమెను మరచిపోయిన జాతీయ నాయకురాలిగా గుర్తించాయి. నీరా ఆర్య 1902 మార్చి 5న ఉత్తర ప్రదేశ్ లోని ఖేక్రా నగర్ లో మహవీర్, లక్ష్మీదేవి దంపతులకు జన్మించారు. ఎనిమిదేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఆమె చిన్నప్పటి నుండి నిజమైన జాతీయవాది, స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో భాగం కావాలనే దార్శనికత ఎల్లప్పుడూ ఉండేది. కలకత్తాలో తండ్రి వ్యాపారం చక్కగా సాగడంతో కలకత్తాలో ఆమె చదువు కొనసాగింది. ఆ సమయములో బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు భాషలతోపాటు మరి కొన్ని భాషలు నేర్చుకుంది. బ్రిటిష్‌లో పనిచేస్తున్న సీఐడీ ఇన్ స్పెక్టర్ శ్రీకాంత్ జైరంజన్ దాస్‌ను వివాహం చేసుకుంది. ఇద్దరి అభిప్రాయాలు వేరు. నీరా ఆర్య దేశ భక్తి, జాతీయవాది, భర్త శ్రీకాంత్ జైరంజన్ దాస్ బ్రిటిష్ సేవకుడు.

ఎంతో మంది వీరుల ప్రాణ త్యాగం

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది వీరులు తమ ప్రాణ త్యాగం చేశారు. కొంత మంది అమర వీరుల చరిత్రలు ప్రజలకు తెలియదు. అటువంటి వారిలో నీరా ఆర్య ఒకరు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు. బ్రిటిష్ ప్రభుత్వం శ్రీకాంత్ జైరంజన్ దాస్‌కు నేతాజీ చంద్రబోస్‌ను చంపే బాధ్యతను అప్పగించింది. అటువంటి సమయంలో నీరా ఆర్య శ్రీకాంత్ ను వివాహం చేసుకున్నది. నేతాజీ ప్రాణాలను కాపాడతానని వాగ్దానం చేసింది. ఒకప్పుడు జైరంజన్ దాస్ నేతాజీ పై కాల్పులు జరిపాడు. అదృష్టవశాత్తూ, అతను తప్పించుకున్నాడు. బుల్లెట్ అతని డ్రైవర్ ను తాకింది. నీరా ఆర్యకు దాని గురించి తెలిసినప్పుడు ఆమె తన భర్త శ్రీకాంత్ జై రంజన్ దాస్ కత్తితో పొడిచి చంపింది. నీరా ఆర్య లొంగిపోయిన తరువాత, ఎర్రఫోర్ట్ లో విచారణ జరిగాక ఖైదీలందరినీ విడుదల చేశారు, నీరా ఆర్యకు మాత్రం తన భర్త హత్యకేసులో శిక్ష విధించబడింది, ఆమెను కాలాపాని జైలుకు (సెల్యులార్ జైలు, అండమాన్) పంపబడి, హింసించబడింది. నీరా



తన ఆత్మకథను వ్రాసింది. ఆమె హృదయపూర్వక కథలను రాసిన ఉర్దూ రచయిత "ఫర్హానా తాజ్"కు తన నిరాశానిస్పృహల జీవిత కథలను పంచుకుంది. అండమాన్ పరిస్థితులను వివరిస్తూ 'మాకు జైలులో కు చిన్న సెల్స్ ఉన్నాయి. మహిళలు అలాగే వారి శిక్షను అనుభవిస్తున్నారు. ఆ మహిళలు రాజకీయ నిర్ణయాలను వ్యతిరేకించినందుకు అక్కడికి చేరుకున్నారు. ఈ లోతైన సముద్రంలో తెలియని ద్వీపంలో నివసిస్తున్నప్పుడు నాకు స్వేచ్ఛ ఎలా లభిస్తుందని నా మనస్సులో ఆందోళన కలిగింది, ఎంత చల్లగా ఉన్నప్పటికీ నేలపై నిద్రపోయాను. 12 గంటల సమయంలో ఒక గార్డు రెండు దుప్పట్లతో వచ్చి వాటిని నాపై విసిరాడు. మాట్లాడకుండా వెళ్లిపోయాడు. అప్పటికి, నా చేతులు, కాళ్ళ చుట్టూ కట్టిన గొలుసులను ఎలా వదిలించుకోవాలోనని నా ఆందోళన, నేను నా మాతృభూమి నుండి విడిపోతున్న భావన కలిగి ఉన్నాను. మరుసటి రోజు బ్లాక్ స్మిత్ వచ్చినప్పుడు అతను నా చేతి నుండి గొలుసును కత్తిరిస్తూ నా చేతి చర్మాన్ని కొద్దిగా తీసివేశాడు. నేను పట్టించుకోలేదు. సుత్తితో సంకెళ్లను కత్తిరించడం ప్రారంభించినప్పుడు సంకెళ్లకు బదులుగా నా ఎముకలను 23 సార్లు కొట్టాడు. ఇది చాలా బాధగా ఉన్నది అని చెప్పాను. మీరు నా కాళ్లను కొడుతున్నారు, మీరు గుడ్డిగా వారా"? అని అడిగినపుడు అతను జవాబిచ్చాడు, నేను మీ హృదయాన్ని కూడా కొట్టగలను, దాని గురించి మీరు ఏమి చేయగలరు? జైలర్ బదులిచ్చాడు, మీరు అబద్ధం చెప్పారు. నేతాజీ ఇంకా సజీవంగా ఉన్నాడు. అని సమాధానం చెప్పాను. అప్పుడు జైలర్ అతను ఎక్కడ ఉన్నాడు అని అడిగాడు? నేను నా మనస్సులో నా హృదయంలో (గుండెలో) అని బదులిచ్చాను' అని నీరా పేర్కొన్నారు.

జైలులో అనేక బాధలు, చిత్రహింసలు

'జైలర్ కోపంతో, అప్పుడు మేము నేతాజీని మీ హృదయం నుండి తొలగిస్తామని అన్నాడు. జైలర్ నన్ను అనుచితంగా తాకాడు, అసభ్యంగా ప్రవర్తించాడు. ఛాతీ ప్రాంతంలో నా వస్త్రాన్ని చీల్చమని కమ్మరిని సూచించాడు. కమ్మరి దానిని కత్తిరించడానికి నా కుడి రొమ్మును నొక్కడం ప్రారంభించాడు. భాదతో విలవిలలాడాను. జైలర్ 'కత్తి పదునుగా లేనందువల్ల బతికి పోయావు' అంటూ వదిలేశాడు' అని నీరా ఆర్య తన బాధలను వివరించింది. నీరా ఆర్య వంటి సమర యోధుల వంటి కథలు చాలా ఉన్నాయి. వారు ఈ దేశానికి దోహదపడ్డారు. దురదృష్టవశాత్తు, పాఠ్యపుస్తకాలలో గుర్తింపు పొందలేదు. హంతకులు, దేశద్రోహుల చరిత్రలు కీర్తించబడ్డాయి. నిజమైన యోధులకు గౌరవం ఎప్పుడూ లభించలేదు, నీరా తన జీవితంలో చివరి రోజులను పూలమ్ముతూ గడిపింది. హైదరాబాద్ లోని ఫలక్ నుమా లోని ఒక చిన్న గుడిసెలో నివసించారు. కానీ, ఆమె కుటీరాన్ని ప్రభుత్వ భూమిలో నిర్మించడంతో కూల్చివేసారు. ఆమె 1998 జూలై 26 మరణించింది. నీరా ఆర్యకు దురదృష్టవశాత్తు ఇప్పటికీ ఎటువంటి గుర్తింపు గౌరవం పొందలేదు. భారత జాతీయ సైన్యంలో మొదటి మహిళా గూడచారి నీరా ఆర్య. దేశం పట్ల నిస్వార్ధ అంకితభావం కలిగిన నీరా ఆర్య సాహసోపేతమైన కథ కన్నడ చిత్ర నిర్మాత దర్శకత్వం వహించిన చిత్రం ద్వారా వెలుగులోకి వచ్చింది. నీరా ఆర్య వంటి దేశభక్తురాలి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉన్నది. ఆమె జయంతి వర్ధంతులను అధికారికంగా ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. ఈమె జీవిత చరిత్ర నేటి విద్యార్థినులకు మహిళలకు స్ఫూర్తి పాఠం అనడంలో అతిశయోక్తి లేదు.

(వ్యాస రచయిత స్టేట్ టీచర్స్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు)

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్



రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ ఆర్థిక ప్రపంచం ముందుకు తెచ్చిన మహత్తర ఘట్టంగా నిలిచింది. డిసెంబర్ 8, 9 తేదీలలో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన ఈ మహా సమ్మేళనం తెలంగాణ ఆర్థిక భవిష్యత్తుకు కొత్త దిశా నిర్దేశం చేసిన ఆవిష్కరణ వేదికగా అభివర్ణించ బడింది. పెట్టుబడి దారులు, గ్లోబల్ సంస్థల ప్రతినిధులు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, వందలాది సి ఇ లు, సాంకేతిక నిపుణులు, దౌత్య ప్రతినిధులు కలిసి రెండు రోజులపాటు తెలంగాణ అభివృద్ధి దిశలను విశ్లేషించి, సహకారం, పెట్టుబడి, భాగస్వామ్యాలపై నిర్ణయాలు తీసుకున్నారు. రెండు రోజుల సమయంలో మొదటి రోజు ₹3,97,500 కోట్లకు, రెండో రోజున ₹1,77,500 కోట్లకు కేంద్ర పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు కథనాలు సూచిస్తున్నాయి.

పెట్టుబడి ఒప్పందాలు రూ.5.75 లక్షల కోట్లు

ఈ సమ్మిట్ ద్వారా ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి ఒప్పందాలు సుమారు రూ.5.75 లక్షల కోట్లకు చేరుకోవడం ద్వారా తెలంగాణ రాష్ట్రం కొత్త పారిశ్రామిక యుగ ప్రవేశాన్ని ప్రపంచానికి తెలియజేసింది. ఈ పెట్టుబడులు డేటా సెంటర్లు, కృత్రిమ మేధ, ఫార్మా ఉత్పత్తి, ఎలక్ట్రానిక్స్, రీన్యూవబుల్ ఎనర్జీ, హెల్త్‌టెక్, తయారీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలకు విస్తరించడం ప్రత్యేక విశేషం. ముఖ్యంగా అతి పెద్ద డేటా సెంటర్ ప్రాజెక్టుకు సుమారు 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ప్రకటించబడటం రాష్ట్రం డిజిటల్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నదనే సంకేతం ఇచ్చింది. 44 దేశాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొనడం తెలంగాణ గ్లోబల్ దృష్టిలో ఉన్న ప్రాముఖ్యతను తెలియజేసింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ బ్యాంక్, అనేక అంతర్జాతీయ అభివృద్ధి సంస్థలు తమ సహకారం, సాంకేతిక మద్దతు, విధాన సూచనలు అందించేందుకు ముందుకు రావడం తెలంగాణ అభివృద్ధి ప్రయాణానికి అంతర్జాతీయ ధ్రువీకరణ లాంటిదిగా నిలిచింది. ఈ సమావేశంలో విడుదల చేసిన 'తెలంగాణ రైజింగ్ 2047' దూరదృష్టి పత్రం రాష్ట్రాన్ని 2047 నాటికి రాష్ట్రంలో 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా మారాలన్న లక్ష్యంతో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని ప్రతిపాదిస్తోంది. అలాగే అనేక



రంగాలలో సమగ్ర ప్రణాళికను సమర్పించింది.

జీవిత ప్రమాణాలను పెంచే సంక్షేమాభివృద్ధి

ఈ విజన్‌లో సామాన్య ప్రజల జీవిత ప్రమాణాలను పెంచే సంక్షేమాభివృద్ధి, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, గ్రామ-పట్టణ సమగ్ర వృద్ధి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు సులభ రుణాలు అందించే డేటా బ్యూరో వ్యవస్థ, భారీ డిజిటల్ మౌలిక వసతుల వంటి కీలక అంశాలు ఉన్నాయి. రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన నిపుణుల తయారీ, ఆరోగ్య-విద్య రంగాల్లో నాణ్యతపెంపు వంటి అంశాలు ఇందులో ప్రధాన ప్రాధాన్యం పొందాయి. సమ్మిట్ ముగింపు వేళ నిర్వహించిన 3,000 డ్రోన్ల లేజర్ షో ప్రపంచ దృష్టిని ఆకర్షించి గిన్నిస్ రికార్డు నమోదు చేయడం తెలంగాణ ప్రపంచ వేదికపై తన సత్తా ప్రదర్శనగా నిలిచింది. 'Telangana is Rising. Come Join the Rise' అని ఆకాశాన్ని అలంకరించిన సందేశం ఈ సమ్మిట్ ఆత్మను ప్రతిబింబించింది. ఈ పెట్టుబడుల వల్ల రాష్ట్రంలో ప్రత్యక్ష-పరోక్షంగా లక్షలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశముంది. డేటా సెంటర్, శక్తి, ఫార్మా, తయారీ రంగాల విస్తరణ వల్ల స్థానిక యువతకు భారీ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎంఎస్ఎంఈ రంగం కోసం రూపొందిస్తున్న క్రెడిట్ యాక్సెస్ విధానాలు చిన్న-చిన్న వ్యాపారాల ఆర్థిక శక్తిని పెంచుతాయి. పట్టణ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బలోపేతం, రోడ్లు, విద్యుత్, నీటి వసతుల విస్తరణతో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

పర్యావరణ రక్షణ, నీటి సామర్థ్యం

అయితే, ఈ భారీ పెట్టుబడుల అమలులో భూమి వినియోగం, పర్యావరణ రక్షణ, నీటి సామర్థ్యం, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలు కీలకం. పెట్టుబడులు ప్రకటించడమే కాకుండా అవి సమయానికి అమలు కావడం, ప్రాజెక్టులు ప్రారంభం కావడం, ఉద్యోగాలు సృష్టించబడడం ప్రభుత్వానికి పెద్ద పరీక్షగా ఉంటుంది. ఉపయోగకర సమాజాభివృద్ధికి ఈ పెట్టుబడులు నిజమైన ఫలితాలు ఇవ్వాలంటే స్పష్టమైన కాలపట్టికలు, పారదర్శక విధానాలు, పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. మొత్తం మీద తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక శిల్పాన్ని నిర్మించే అత్యంత ప్రాముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ప్రపంచ దేశాల దృష్టిని తెలంగాణపై నిలిపి రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా మార్చే శక్తివంతమైన పునాది వేసింది. ప్రకటనలు, ఒప్పందాలు, దూరదృష్టి, ఇవి కలిసి తెలంగాణను నిజంగా రైజింగ్ రాష్ట్రంగా తీర్చిదిద్దే మార్గాన్ని స్పష్టతతో చూపించాయి. ఈ అవకాశాన్ని సుస్పష్టమైన అమలుతో, పారదర్శకతతో, సమగ్ర అభివృద్ధితో నిజమైన పురోగతిగా మారుస్తేనే తెలంగాణ 2047 విజన్ పరిపుష్టమవుతుంది.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

ఇంకా తొలగని పౌష్టికాహార లోపం




కామిడి సతీష్ రెడ్డి
9848445134

ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలలలో ఇరవై శాతం వరకు భారతావనిలోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో చెప్తున్నది. ప్రజలు ఏ మేరకు పౌష్టికవిలువలు ఉన్న ఆహారం తీసుకుంటున్నారనేది దేశ ఆర్థిక పరిస్థితికి సంకేతాలుగా నిలుస్తుందంటారు. భారత్ లో గత మూడు దశాబ్దాలలో ప్రజల ఆర్థిక స్థితిగతులలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆహార అలవాట్లు కూడా మారిపోయాయి. సాగు భూములు పెరగడం, వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం చోటు చేసుకోవడంతో ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. అయినా, ఇప్పటికీ దేశంలో 15 శాతం జనాభాకు ఆకలి బాధలు తప్పడం లేదని అనేక సర్వేలు వెల్లడి చేస్తున్నాయి. 115 దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించిన ప్రపంచ ఆకలి సూచి 2019లో భారత్ 102వ స్థానం. దేశంలో ఇప్పటికే దాదాపు ఇరవై కోట్ల మందికి పైగా పౌష్టికాహార సమస్యలతో సతమతమవుతున్నారు. ఇందులో 15 నుంచి 45 యేండ్ల వయస్సు ఉన్న మహిళలలో 51 శాతం అత్యంత బలహీనంగా ఉంటున్నారని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఓ) నివేదిక స్పష్టం చేస్తున్నది.

రక్తహీనత సమస్యలు

చాలా మంది రక్తహీనత సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఐదేండ్లలోపు పిల్లలు దాదాపు 70 శాతం సరైన పౌష్టికాహారం లభించక రకరకాల సమస్యలతో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఐదు సంవత్సరాలలోపు పిల్లలలో దాదాపు 40 శాతం మంది తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఎన్నో నివేదికలు వెల్లడిస్తు న్నాయి. భూమ్మీద పుట్టినవారికి ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కనులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది పాలక పెద్దలే. తల్లీబిడ్డకు పౌష్టికాహారం అందివ్వకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తుంది. అలాని పాలకులు ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారు. లక్షల కోట్లు వెచ్చించారు. అయినా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. ఇప్పుడు కొత్త చట్టాలు ప్రవేశపెట్టకపోతేపోయారు ఉన్న పథకాలను ఏమేరకు అమలు చేస్తున్నారో అర్హులైన వారిలో ఎంత మందికి అందిస్తున్నారో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.



నిధులు అక్రమ మార్గాలకు

నిశితంగా పరిశీలించి, పరిశోధిస్తే ఈ పథకాలకు కేటాయించిన నిధులు అక్రమ మార్గాలకు ఎలా మళ్లిస్తున్నారో దర్యాప్తు జరిపితే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తాయి. పర్యవేక్షణ లోపం కారణంగా తల్లీబిడ్డకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతోంది. పటిష్ట చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. భారత్ లోనేకాదు, ప్రపంచ వ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెచ్చరిల్లుతోందనే చెప్పొచ్చు. మన దేశంలో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకాల ఆహార సమస్య అధికంగా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు, దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. 1975లోనే ఆరేండ్లలోపు పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వం సమీకృత శిశు అభివృద్ధి పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రధాన మంత్రి మాతృవందన యోజన, పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఎన్నో కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. అంగన్వాడీ సరుకులలో నాణ్యత లోపిస్తు న్నట్లు ఆరోపణలున్నాయి.

(వ్యాస రచయిత సైన్స్ ఉపాధ్యాయులు, ములుగుపల్లి ఉన్నత పాఠశాల, జేఎస్ భూపాలపల్లి)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రజలంతా కాంగ్రెస్‌ను విశ్వసిస్తున్నారు

- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్



ప్రతిపక్షం బ్యూరో సిద్ధిపేట డిసెంబర్ 12: కాంగ్రెస్ కార్తీ బలపరిచిన సర్పంచ్ వార్డు అభ్యర్థులను గెలిపించి మీ యొక్క గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. రెండవ విడత ఎన్నికలలో చిన్నకోడూరు మండలంలో గ్రామాలు మైలారం ఇతర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి అని కోరుతూ సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ గడపగడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వల్లే అభివృద్ధి జరుగుతుంది అని గ్రామాల ప్రజలు విశ్వసిస్తున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ప్రతి హామీలను నెరవేరుస్తున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరిస్తున్నారు అని అన్నారు. సిద్ధిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలి అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది గనుక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామాలకు నిధులు వస్తాయి అని అన్నారు. పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో అధికారంలోకి తెచ్చి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి తిరుగులేదు అని అన్నారు. గ్రామం ప్రజలకు ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి కానీ సిద్ధిపేట నియోజకవర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ దృష్టికి తీసుకురావాలని మీకు అన్ని వేళలా అందుబాటులో ఉంటాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్ సతీష్ గౌడ్ గ్యాదర్ మధు గాయాజుద్దీన్ హర్షద్ బాబా సాదిక్ తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు
అన్ని సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కే. హైమావతి

ప్రతి పక్షం దుబ్బాక డిసెంబర్:12 . రెండవ విడత పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించాలి అని జిల్లా కలెక్టర్ కే హైమవతి అన్నారు. శుక్రవారం జిల్లాలోని రెండవ విడత మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి మిరుదొడ్డి తొగుట మండలాల్లో పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా దుబ్బాక మండలంలో పెద్ద గుండవెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, హబ్సీపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం అక్బర్ పేటభూం పల్లి మండలంలో పోతిరెడ్డిపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అక్బర్ పేటభూం పల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఖాజీపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రుద్రారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం మిరుదొడ్డి మండలంలో చెప్యాలగ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్వాల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు.అనంతరం తొగుట మండలంలో గుడికందుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద మాసన్ పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గల సౌకర్యాలను జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు .అనంతరం జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ...జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిపేందుకు అధికారులు పోలింగ్ స్టేషన్ లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. .కలెక్టర్ వెంట ఆయా మండల ఎంపీడీవోలు, తాసిల్దార్ లు తదితరులు ఉన్నారు.



అభివృద్ధికి సహకరించే నాయకులను గెలిపించండి

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 12: గ్రామ అభివృద్ధికి సహకరించే నాయకులకు ఓటు వేసి పట్టం కట్టాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాస పుష్పకిష్టయ్యకు మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాయమాటలు చెప్పి మోసం చేసే నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. గతంలో ఏనాడూ మిరుదొడ్డి అభివృద్ధికి కృషి చేయని నాయకులు మేమే అభివృద్ధి చేస్తామని మాట్లాడడం సిగ్గుచేటని, ఎంపీ రఘునందన్ రావుపై ఘాటుగా విమర్శలు చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేసే కాస పుష్పకిష్టయ్య ఓటు వేసి పంచాయతీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మిరుదొడ్డి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సర్పంచ్ అభ్యర్థి కాసా పుష్పకిష్టయ్య విన్నవించారు.



వైశ్య లైమ్‌లైట్ అవార్డు గ్రహీత
అనూషకు సత్కారం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 12: ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా నిర్వహించిన పోటీలో మోస్ట్ పాపులర్ మహిళా గా ఎంపికై వైశ్య లైమ్‌లైట్ అవార్డుకి అర్హత సాధించిన సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం పీఆర్వో శ్రీరామ్ అనూష (ప్రణవి) ను దౌల్తాబాద్‌లోని ఆమె నివాసంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి డా. మాంకాల నవీన్ కుమార్, నాగరాణి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనూష కష్టపడి, సుమారు 400 ఓట్ల మెజార్టీతో ఈ విజయం సాధించి తెలంగాణ ఆర్యవైశ్య గౌరవాన్ని నిలబెట్టిందని అభినందించారు. డిసెంబర్ 27న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు అందుకోనుంది .ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు, వాసవి క్లబ్ దంపతుల అధ్యక్షులు శ్రీరామ్ శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహ విద్యార్థుల్లో చైతన్యం పెంచాలి

- వలుస సుభాషచంద్రభోస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 12: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వసతి గృహంలో విద్యార్థులతో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలుస సుభాష చంద్రభోస్ శుక్రవారం సందర్శించి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారికి ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదివి భవిష్యత్తు లక్ష్యాలను సాధించాలన్నారు.తల్లిదండ్రుల ఆశలను నిజం చేయడానికి ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతేనె ఉజ్వల భచేస్తూ ప్రేరణ పొందాలని, సమాజంలో గుర్తింపు పొందిన వ్యక్తులుగా ఎదగడానికి శ్రమించాలన్నారు. విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు, సమయపాలన, క్రమశిక్షణను అలవరచుకోవాలనివిష్యత్ కు నాంది అవుతుందని గుర్తుచేశారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం వలుస సుభాషచంద్రభోస్ సూచించారు.ఈ కార్యక్రమంలో వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.



దుంపల రమ్య రాజును భారీ మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం,చేగుంట, డిసెంబర్12: చేగుంట సర్పంచ్ అభ్యర్థిగా దుంపల రమ్య డిష్ రాజు ను గెలిపించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చేగుంటలో జరిగిన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దుంపల రమ్య రాజు ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. పోటీపడుతున్న అభ్యర్థుల్లో దుంపల రమ్య రాజు ప్రజలతో మమేకమై ఉండే వ్యక్తులని గుర్తుచేశారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం గెలుపుకు నాంది అన్నారు. ప్రచార కార్యక్రమంలో చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ అలీ పద్మశాలి సంఘం అధ్యక్షులు మేకల రవి పట్టణ అధ్యక్షులు ఎర్ర యాదగిరి క్రాంతి అంజిరెడ్డి సత్తయ్య పులబోయిన రవి వల్ప మహేష్‌గుండ్ల సంపత్ అన్నం రవి మంచి కట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధులకు హాజరుకాని
182 మంది ఉద్యోగుల సస్పెన్షన్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 12: సిద్దిపేట జిల్లాలో గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు ఈ నెల 11వ తేదీన శాంతియుతంగా నిర్వహించబడ్డాయి. అయితే ఎన్నికల డ్యూటీకి హాజరుకాని 182 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే. హైమావతి తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వ సిబ్బంది కీలకపాత్ర పోషించాలని, డ్యూటీ పట్ల నిర్లక్ష్యం చూపిన వారిపై కఠిన చర్యలు తప్పనిసరి అవుతాయని ఆమె స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను అవాంతరం లేకుండా నిర్వహించేందుకు భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.



అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చూడండి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 12: ఎన్నికల ప్రచారం ఆఖరి రోజు గ్రామంలో ప్రచారం జోరందుకుంది. గ్రామ అభివృద్ధికి పాటు పడేలా బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని నిజాంపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి చలిమేటి.నరేందర్ ప్రచారంలో జోరు పెంచారు.ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థి చలిమేటి. నరేందర్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో యువకులు,మహిళలు, పాల్గొని ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ నమూనా పత్రాలను ఓటర్లకు చూపిస్తూ ఓట్లను అభ్యర్థించారు. తమకు కేటాయించిన బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామ ప్రజలు నన్ను ఆదరించి సర్పంచిగా గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఒక అవకాశం ఇస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు.ప్రతి ఒక్కరు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి నన్ను ఆశీర్వదించి,గెలిపించాలని అభ్యర్థించారు.ఈ ప్రచారంలో మాజీ జడ్పీటీసీ పంజా. విజయ్ కుమార్, నాయకులు,మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రజల పక్షాన పోరాడే భాస్కర్ రెడ్డిని గెలిపించండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్

ప్రతిపక్షం, చేర్యాల, డిసెంబర్ 12: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే కత్తుల భాస్కర్ రెడ్డికే ప్రజలు పట్టం కట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ అన్నారు. శుక్రవారం చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి కత్తుల భాస్కర్ రెడ్డి ని గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే ఉద్యమాలు నిర్వహిస్తూ గ్రామ మండలంలో నెలకొన్న అనేక సమస్యల సాధనలో భాస్కర్ రెడ్డి కీలకపాత్ర పోషించారని అన్నారు. గ్రామంలో నెలకొన్న త్రాగునీరు, సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణం, వీధి దీపాలు కావాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనిచేశారని, గ్రామంలో పెండింగ్ లో ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేయాలని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనం పూర్తయినంతవరకు పట్టు వీడకుండా పనిచేశారని, కడవేరు వంతెన నిర్మాణం చేపట్టాలని అధికారులకు వినతిపత్రాలు ఆందోళనలు నిర్వహించి స్పందన లేకపోవడంతో గాడిదకు వినతిపత్రం ఇవ్వడానికి కారణంగా అప్పటి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి స్పందించి 24 గంటల్లోపు భూమి పూజ చేశారని తెలిపారు. విద్యావేత్తగా, ఉద్యమకారుడిగా పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ముందుకు వస్తున్నాడని భాస్కర్ రెడ్డి ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఈరి భూమయ్య కుడిక్యాల బాల్ మోహన్, నంగి కనకయ్య, నంగి సత్తయ్య, జింకల బాల మల్లు, రాజు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలకు విఘాతం కలిగించవద్దు

- శాంతియుత ఎన్నికలకు సహకరించాలి
- అంతర్గం మండల ప్రజలు అభ్యర్థులతో డీసీపీ సమావేశం
- పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి




ప్రతిపక్షం (గోదావరిఖని) డిసెంబర్ 12: రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధి లోని అంతర్గాం మండలంలో శుక్రవారం పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి ఏం. రమేష్ తో కలిసి ముర్మూర్, ఎల్లంపల్లి,గోలివాడ గ్రామాలను సందర్శించి ప్రజలు, గ్రామ పెద్దలు, అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు గ్రామ పెద్దలు, పోటీ అభ్యర్థులు ఎన్నికల సమయంలో పాటించాల్సిన చేయవలసిన పనులు చేయకూడని పనుల గురించి వివరించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమని,వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా అందరూ సమన్వయం పాటించాలని అన్నారు.గ్రామాల్లో ఏదైనా మర్షణ వాతావరణంఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు గౌరవించి పోలీసులకు సహకరిస్తే ఎన్నికలు మరింత ప్రశాంతంగా కొనసాగుతాయని అన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. నియమ నిబంధనలు పాటించక పోతే కేసులు సైతం నమోదు అవుతాయని తెలిపారు.ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సూచనలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా చట్టం అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు,ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలుగాని సమావేశాలకుగాని అనుమతి లేదని,ఇది గమనించి అందరూ సహకరించాలని గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా స్పష్టమైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,అంతర్గాం ఏస్సై వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జిడికే 2,2ఏ ఇంక్లైన్‌లో 56 వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు

ప్రతిపక్షం, గోదావరిఖని, డిసెంబర్ 12: ఆర్ జి 1 ఏరియా జీడికే 2,2ఏ ఇంక్లైన్ లో శుక్రవారం సింగరేణి స్థాయి 56 వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు .ఈ రక్షణ పక్షోత్సవాలకు ముఖ్య అతిధి గా తనిఖీ కన్వీనర్ శ్రినాద్ ఏజియం (సి.యం.సి) కార్పోరేట్,హాజరై రక్షణ పట్ల ఉద్యోగులకు రక్షణ సూత్రాలు,జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా రక్షణ పక్షోత్సవాల సంవత్సరంలో ఒక సారి కాకుండా ప్రతి ఒక్కరు రక్షణ గురించి ఆలోచన చేసి ముందుకు సాగుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.రక్షణపై అవగాహనతో పనులు చేసి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని తెలిపారు. రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ముఖ్య అతిధుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం రక్షణ కమిటీ సభ్యులు జిడికే 2,2ఏ,ఇంక్లైన్ అండర్ గ్రౌండ్ లో పని ప్రదేశాలను తనిఖీ చేసారుఈ కార్యక్రమం లో జి ఎమ్ డి.లలిత్ కుమారు, జియం సేఫ్టీ ఎస్. మధుసూదన్, సీఎం ఓ ఏ ఐ ప్రతినిధి పొనగోటి శ్రీనివాస్,ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, ఏరియా సేఫ్టీ అధికారి సాయి ప్రసాద్,ఏజంట్ డి.రమేష్ ,గని మేనేజర్ యస్.కే అల్లాఉద్దీన్, స్టాటుటరి మేనేజర్ డి.రమేష్, తనిఖీ కమిటి సభ్యులు ఎస్. లక్ష్మణ్,వి.రాధ కృష్ణ,ఎం డి. అప్సర్ పాషా,ఎం.కిరణ్ కుమార్, కె అమర్ నాథ్,జె.శ్రీనివాస రావు, పి.ఆదినారాయణ,టీ.రాజన్న,ఏ రాజు,సేఫ్ట్ ఆఫీసర్ జాన్సన్, వెల్ఫేర్ ఆఫీసు డి.గణేష్,పిట్ ఇంజనీర్ కల మల్లేష్,డి. వెంకటేశ్వర్లు,ఎం డి సల్మాన్ ఖాన్, జి.కుమారస్వామి,పి.వెంకట్రావు జూ.సర్వే ఆఫీసర్ ఇతర ఆఫీసర్లు, ఫిట్ సెక్రటరి పొన్నాల వెంకటయ్య,కారం పొడి వెంకన్న, వర్క్మెన్ ఇన్స్పెక్టర్ లు, యునియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



“



డేటా రక్షణను దృష్టిలో ఉంచుకుని జనాభా లెక్కల సమాచారం ఇకపై పూర్తిగా డిజిటల్ రూపంలోనే ఉంటుంది. 2027 జనాభా లెక్కలు మొట్టమొదటి డిజిటల్ జనాభా లెక్కలు అవుతాయి. 2 దశల్లో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ముందు గృహాల గణన, జాబితా తయారీ, ఆపై జనగణన ఉంటుంది. 2027 జనగణన నిర్వహణకు ₹11,718 కోట్లను కేటాయించింది
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రాంతీయం



ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

- రానున్న ఎన్నికలలో మరిన్ని స్థానాలు కైవసం చేసుకుంటాం
- డీసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 12 : మొదటి విడతలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా సర్పంచ్ స్థానాలను కైవాసం చేసుకుందని రానున్న ఎన్నికలలో మరిన్ని స్థానాలు కైవసం చేసుకుంటామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో మొదటి విడత లో 184 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే అందులో సుమారు 140 స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరిగింది అంటే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పై కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలన పై ఉన్న నమ్మకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలో ప్రజా పాలన అందిస్తూ ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సర్పంచులుగా గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూనే వారి విజయానికి కారకులైన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలో సుమారు 80 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ ప్రభుత్వం కైవసం చేసుకుంది అని నగేష్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పాగంగారెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, సేవదల్ అధ్యక్షుడు సంతోష్, ఓబీసీ అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్, మహమ్మద్ ఈసా ,అబ్దుల్ ఎజాజ్ ,సాయికిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు నాగేష్.. అక్రమాలకు లేదు హద్దు

- మాజీ సర్పంచ్.. కానీ కోట్లలో సంపద
- తుంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ ఘనమైన చరిత్ర
- ఓ వివాదంలో కేసు నమోదుతో స్థానికంగా తీవ్ర చర్చ





ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్,డిసెంబర్ 12: ఆయనో మాజీ సర్పంచ్.. అయితేనేం.. అతగాడు తలచుకుంటే ఏమైనా చేయగలడు.. చెప్పులు మార్చేసినట్లు పార్టీలు మార్చేస్తాడు.. నాయకులను బుట్టలో వేసుకుంటాడు.. అలాగే ప్రభుత్వాధికారులను కొనేస్తాడు.. లెక్కలేని అక్రమాలు చేసేస్తాడు.. లక్షలు కొల్లగొడతాడు.. అతనికి అడ్డు అనేది లేదంటే అతిశయోక్తి కాదు.. అతని పేరు ఎద్దు నగేష్.. అతగాడు చేసే అక్రమాలకు అసలు ఉండదు హద్దు.. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇతగాడు సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టాడు.. మరెక్కడో కాదు మన ప్రియతమ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గం, శామీర్పేట్ మండలం, తూముకుంట గ్రామపంచాయతీ.. అది నేడు జీ.హెచ్.ఎం.సి.లో కలిసిపోయింది.. 2014 నుంచి 2018 వరకు మేడ్చల్ జిల్లా, శామీర్ పేట్ మండల్, తూముకుంట గ్రామ పంచాయతి సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన ఎద్దు నాగేష్.. ఓ కార్యదర్శిని అడ్డం పెట్టుకొని నకిలీ ఇంటి అనుమతులు ఇప్పించేవాడు.. ఫేక్ స్టాంప్ లు వేసి మరీ ఈ దందా నడిపిస్తూ లక్షల రూపాయిలు సొమ్ము చేసుకున్నాడు అన్నది జగమెరిగిన సత్యమే.. ఇక ఇతగాడు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపాటికి జిందాబాద్ లు, జేజేలు కొట్టి తాను చేసిన అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకు పూటకో వేషం వేస్తూ పొద్దు గడుపుతూ ఉండేవాడు.. ఇలాంటి మాయలోడి భాగోతం నేడు బట్టబయలైంది.. అసలా కథా కమామీషు ఒకసారి చూద్దాం.. బోధన్ జిల్లా, కజీపూర్ కు చెందిన సునీత అనే మహిళ తుంకుంట గ్రామానికి వచ్చి వెంకట్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో నివాసం ఉంటోంది.. ఇటీవలే తన తండ్రి ఆరోగ్యం బాగా లేకపోతే, బోధన్ కజీపూర్ కు వెళ్లి అక్కడే రెండు నెలలు ఉంది.. అనంతరం తన తండ్రి ఆరోగ్యం కుదుటపడ్డ తర్వాత.. తూముకుంటలో ఉన్న తన నివాసానికి వచ్చి చూడగా.. స్థానికంగా ఉండే మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్‌యాదవ్ అనే వ్యక్తి తన ఇంటి తాళాలు పగలగొట్టి, ఇంట్లో ఉన్న సామాను ఎత్తుకెళ్లి.. మరో మహిళను తీసుకువచ్చి ఆ ఇంట్లో పెట్టాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది బాధితురాలైన సునీత.. దీంతో విషయం తెలుసుకున్న పోలీసుల మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ పై కేసు నమోదు చేశారు. ఇంతటి నీచపు వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పార్టీలో ఎలా కొనసాగిస్తుంది..? ఇలాంటి వాళ్ళ వల్లే పార్టీకి నష్టం జరుగుతుందని స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.. ప్రస్తుతం పార్టీపై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పార్టీలో ఉన్నటువంటి కార్యకర్తలే ఇలాంటి దుర్మార్గాలకు, దుస్సాహసాలకు పాల్పడితే.. అలాంటి వారిని తక్షణమే సస్పెండ్ చేయాలంటూ.. వారు డిమాండ్ చేస్తున్నారు.. పైగా ఇతగాడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.. అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్న ఎద్దు నగేష్ లాంటి వ్యక్తులను క్షమించరాదని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు..కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినాయకత్వం ఒకసారి ఇతని గురించి ఆలోచన చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



గ్రామాలలో అర్బన్ ఎమ్మెల్యే ప్రచారం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 12 : సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అంటే కేవలం పనులు ప్రారంభించడం మాత్రమే కాదు, ప్రజల అవసరాలను అర్థం చేసుకుని వాటిని సమయానికి అమలు చేయడం ముఖ్యమైందన్నారు. సర్పంచ్‌గా ప్రజలతో అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమన్నారు. భారతీయ జనతా పార్టీ బలపరిచిన మా అభ్యర్థులు ఇదే నిబద్ధతతో ముందుకు సాగుతున్నారని అన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వేదికలు, రేషన్ బియ్యం, స్మశాన వాటికలు, ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, శుద్ధి నీరు, రహదారులు, వెలుగులు, పరిశుభ్రత మొదలగు సంక్షేమ పథకాల పారదర్శక అమలు వంటి అంశాల్లో మా అభ్యర్థులు చక్కటి మార్పు తీసుకురాగలరని, గ్రామ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్న ఈ సమయంలో మా అభ్యర్థులను గెలిపించి గ్రామాలను ముందుకు తీసుకెళ్లాలని మనవి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీ నారాయణ, నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, పవన్ ముందడ, మరవర్ కృష్ణ, బిజెపి కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

- మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి సంపూర్ణ రాములు

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 12: అవకాశం ఇచ్చి ఆదరించండి అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి సంపూర్ణ రాములు ,ఓటర్లను వేడుకున్నారు, శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించి ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 14న ఆదివారం జరిగే సర్పంచి ఎన్నికలలో ఉంగరం గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు, గ్రామంలోని పెండింగ్ లో డ్రైనేజీ, సిసి రోడ్లను, నాణ్యమైన విద్య, వైద్యం, ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు, మోత్కుపల్లి గ్రామస్తులు ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.

గెలిపించండి అభివృద్ధి చేస్తా



ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 12 : అవకాశం ఇచ్చి ఆదరించండి అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని బాకారం 1వ వార్డు అభ్యర్థి కొంతం నాగేశ్వర్ రెడ్డి వార్డు ఓటర్లను వేడుకున్నారు, శుక్రవారం ఎన్నికల ప్రచారం భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించి గ్యాస్ పొయ్యి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు, ఈ సందర్భంగా కొంతం నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 14 న ఆదివారం జరిగే ఎన్నికలలో గ్యాస్ పొయ్యి గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు, బాకారం 1 వ వార్డు అభివృద్ధికి, నిరంతనం కృషి చేస్తానని ఓటర్లకు తెలియజేశారు,

వార్డులోనే ఉంటా.. అభివృద్ధికి బాటలు వేస్తా



ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 12: వార్డు పరిధిలోనే ఉంటూ అభివృద్ధికి బాటలు వేస్తానని అమ్డాపూర్ గ్రామ 7వ వార్డుకు పోటీ చేస్తున్న కోళ్ల ప్రవళిక యాదయ్య తెలిపారు. 14వ తేదీన జరిగే ఎన్నికల్లో 7వ వార్డు నుండి గౌను గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని. యువతకు రాజకీయాల్లో అవకాశం కల్పించాలని కోరారు. గ్రామంలో వెనుకబడిన వార్డుల్లో ఒకటైన 7వ వార్డులో అభివృద్ధి పనులన చేయడానికి తనకు అవకాశం కల్పించాలని కోరారు.



బీసీలకు కట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలి

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 12: బీసీ కులాలకు చట్టసభల్లో జనాభా రాతి కవితల 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయి ఈశ్వర చారి ఆశయ సాధన సభలో నాయకులు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రానున్న శీతాకాల సమావే శాలలో బీసీలకు ఎన్నికలలో జనాభా ప్రాతి పదికన 42 శాతం బిల్లును బాగా ఆమోదింపజేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు తొమ్మిదవ షెడ్యూల్ బీసీ రిజర్వేషన్ కల్పించాలన్నారు స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడుపుతున్న బీసీలకు అన్యాయం జరుగుతూనే వస్తుందన్నారు ఇప్పటికైనా బిసి కులాలవారు ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేంతవరకు బీసీలు పోరాడుతూనే ఉండవలసిన అవసరం నెలకొన్నదని పేర్కొన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం బీసీలకు రానున్న శీతాకాల పార్లమెంటు సమావేశాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో బీసీలు కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి తీరుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శ్రీనివాస్ పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు తోట రాజేష్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్ రాజు కిరణ్ గోదావరి చంద్రమోహన్ జాగిరి రాజేష్ బిసి సమాజ్ జాతీయ అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ భీమ్సేన్ వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, డిసెంబర్ 12: నర్వ మండలంలోని రాయికడ్ గ్రామానికి చెందిన 25 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ లో చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూలరీ ఆనంద్ ఆధ్వర్యంలోరాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలకు అకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పుల్లారి శశికల రవి, రాయికోడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన 15 కుటుంబాలు

ప్రతిపక్షం, గుండాల, డిసెంబర్ 12: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న అభివృద్ధి నిర్ణయాలకు ఆకర్షితులైన పలు పార్టీలకు చెందిన 15 కుటుంబాలు శుక్రవారం గుండాల మండలంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.గుండాల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దార అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో, పి ఎస్ ఆర్ -పి వి ఆర్ యువసేన కో ఆర్డినేటర్ ఎస్కె ఖదీర్ కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎస్కె ఖదీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రెండు లక్షల రైతు ఋణమాఫీ, రైతు భరోసా, వరికి రూ.500 బోనస్, సంవత్సరకాలానికి రైతు కూలీలకు రూ.12,000 సహాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ఇళ్ల మంజూరు వంటి పథకాలు ప్రజల మనసు గెలుచుకున్నాయని పేర్కొన్నారు.రాష్ట్రాన్ని సంక్షేమ దిశగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కు ధన్యవాదాలు తెలిపారు.తరువాత మండల సమస్యలను ఎమ్మెల్యేకు ఫోన్ ద్వారా విన్నవించగా వెంటనే స్పందించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఖదీర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి వాంకుడోత్ బీకోజీ,నాయకులు పొంబోయిన ముత్తయ్య, ఎస్కె అబ్దుల్ నాభి, ఎస్కె ఖాశిం, వంకుడోత్ రమేష్, ఎస్కె వాజిద్, ఎస్కె ఇస్రార్, నూనావత్ రవి, బొంగు చంద్రశేఖర్, పల్లపు రాజేష్, సోషల్ మీడియా సభ్యుడు మండలోజు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాట్ గుర్తుకు పెరుగుతున్న మద్దతు

ప్రతిపక్షం, వెంకటాపురం, డిసెంబర్ 12: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బి.సి. మర్రిగూడెం గ్రామపంచాయతీ రాజకీయ వేడి పుంజుకుంది. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కోరం సరోజన శుక్రవారం గ్రామంలో భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. ఉదయం నుంచే పార్టీ నాయకులు, అనుచరులు, మహిళా సంఘాలు, యువతతో కలిసి సరోజన ఇంటింటికీ తిరిగి గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాను. తాగునీరు, డ్రైనేజ్, రహదారులు, వీధిలైట్లు వంటి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరిస్తాను అని హామీ ఇచ్చారు. ప్రచారంలో ఆమెకు స్థానిక మహిళలు, వృద్ధులు, రైతులు విశేష స్పందన చూపించారు. అనేక కుటుంబాలు ఇంటి వద్దకే వచ్చిన సరోజనను ఆప్యాయంగా ఆహ్వానించి తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ సరోజన గెలిస్తే గ్రామంలో అభివృద్ధి పనులు వేగం పడతాయి. గతంలో నిలిచిపోయిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటారు అని అన్నారు. రోజంతా సాగిన ప్రచార కార్యక్రమం గ్రామంలో ఎన్నికల వేడిని మరింతగా రగిలించింది. సరోజనకు పెరుగుతున్న మద్దతు నేపథ్యంలో బి.సి. మర్రిగూడెంలో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

రెండవ విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ సిబ్బందికి సూచనలు చేసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 12: రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ , సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి టెలీకాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 14 వ తేదీ పోలింగ్ సందర్భంగా అధికారులు తప్పిదాలకు తావులేకుండా పూర్తిస్థాయి ముందస్తు ప్రణాళికలతో పని చేయాలని ఆన్నారు. పోలింగ్ సమయం: ఉదయం 7 గం. నుండి మధ్యాహ్నం 1 గంటలకు ఉంటుందని, బ్యాలెట్ బాక్సులు, పేపర్లు, సీలింగ్ మెటీరియల్ ముందుగానే సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని అన్నారు. శాంతియుత వాతావరణం కోసం పర్యవేక్షణ బలోపేతం చేయాలని, ఓటరు గుర్తింపు కార్డులతో పాటు మొత్తం 18 రకాల గుర్తింపు కార్డులు ఓటు కోసం అంగీకరించబడతాయని అన్నారు. టెండర్ ఓట్లు అసలైన ఓటర్ కు బదులుగా మరెవరో ఓటు వేసినట్లు తేలితే టెండర్ ఓటు విధించాలని, టెండర్ ఓట్లు 0.1% కంటే ఎక్కువ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. లెక్కింపు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని, ముందు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, అనంతరం వార్డు & సర్పంచ్ బ్యాలెట్ల కౌంటింగ్ ఉంటుందని, ఫలితాల అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు ఫారమ్ 29 ధృవ పత్రాలు జారీ చేయాలని అన్నారు. ఉపసర్పంచ్ ఎన్నికలు కౌంటింగ్ పూర్తికాగానే నిర్వహించాలని, సర్పంచ్ తో పాటు 50% సభ్యులు హాజరవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా రాబోయే రెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ కు సంబంధించిన ఎన్నికల సామాగ్రి ముందుగానే పూర్తిగా సిద్ధం చేయాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, టీ, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం వంటి వసతులను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లు విక్టర్, మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి, బాన్సువాడ ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీ ప్రాంతాల్లో వాహన ప్రమాదాల నేపథ్యంలో రాత్రి పూట పొగమంచు వేళల్లో బస్సు, ఇతర వాహన రాకపోకలను నిషేధిస్తున్నాం. చింతూరు-మారేడుమిల్లి రోడ్డులో బస్సు ప్రమాదంలో 9మంది మృతి బాధాకరం. మృతుల కుటుంబాలకు పరిహారమిస్తాం. ఘాట్ రోడ్లలో వాహనాలు నడిపేవారికి ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ ఉండేలా చర్యలు తీసుకుంటాం. చిన్న తప్పిదాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఏపీ మంత్రి అనిత

విమాన టికెట్ల ధరను యేడాది పొడవునా నియంత్రించలేం

- పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 12: ఇటీవల ఇండిగో సంక్షోభం సమయంలో విమాన చార్జీలు విపరీతంగా పెరిగాయి. దాంతో కేంద్రం ప్రభుత్వం రంగంలోకి దిగి టికెట్ల ధరలపై పరిమితిని విధించింది. తాజాగా విమాన చార్జీల నియంత్రణపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. విమాన టికెట్ల ఛార్జీలను ఏడాది పొడవునా నియంత్రించలేమని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్ లో స్పష్టం చేశారు. పండుగల సమయంలో టికెట్ల ధరల పెరుగుతాయని.. ఛార్జీలపై దేశవ్యాప్తంగా పరిమితి విధించడం ఆచరణాత్మకం కాదని తెలిపారు. నియంత్రణ లేని మార్కెట్ కారణంగా వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రంగం అభివృద్ధి చెందడానికి నియంత్రణ సడలింపులు జరిగాయన్న ఆయన.. అసాధారణ వృద్ధిని చూసిన ఇతర దేశాలు నియంత్రణ ఎత్తివేసిందన్నారు. దాంతో మరిన్ని కంపెనీలు ఈ రంగంలోకి ప్రవేశించేలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. మార్కెట్ డైనమిక్స్ ఆధారంగా ధరలుంటాయని.. అంతిమంగా ప్రయాణీకులు అతిపెద్ద లబ్ధిదారులుగా నిలుస్తారన్నారు. విమాన ఛార్జీలపై నియంత్రణ ఎత్తివేయాలని కోరుతూ ఓ సభ్యుడు ప్రైవేట్ మెంబర్ బిల్లుపై ఆయన స్పందించారు. నియంత్రణ సడలింపు ఆలోచన ఇప్పటికీ కొనసాగుతోందని.. మనం పౌర విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే, అతి ముఖ్యమైన అవసరం ఏమిటంటే.. మరిన్ని కంపెనీలు మార్కెట్లోకి ప్రవేశించగలిగేలా దానిపై నియంత్రణలు తొలగించడమేనన్నారు. ప్రయాణీకుల నుంచి అసమంజసమైన ఛార్జీలను నివారించడానికి చార్జీలపై పరిమితిని నిర్ణయించడం సైతం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.



విశ్వ వీక్షణం



జనవరి 30 నుంచి నిరాహార దీక్ష

- ప్రభుత్వ తీరుకు నిరసనగా అన్నా హజారే నిర్ణయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్12: ప్రభుత్వ తీరుకు నిరసనగా తాను జనవరి 30 నుంచి నిరాహార దీక్ష చేస్తానని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే ప్రకటించారు. మహారాష్ట్ర లోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి లోకాయుక్త చట్టం చాలా కీలకమని, పదేపదే హామీలు ఇచ్చినప్పటికీ దానిని విస్మరిస్తున్నారని, ప్రభుత్వ తీరుకు నిరసనగా తాను నిరాహార దీక్ష చేపడుతున్నానని 88 ఏళ్ల హజారే తెలిపారు. ఇప్పుడు తాను చేపట్టే నిరాహార దీక్షే తన ఆఖరి నిరసన అవుతుందేమోనని వ్యాఖ్యానించారు. లోకాయుక్త చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే 2022లో కూడా తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేశారు. దాంతో చట్టాన్ని అమలు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. ఆ తర్వాత ఓ కమిటీ బిల్లును రూపొందించింది. ఆ బిల్లును మహారాష్ట్ర శాసనసభలోని ఉభయ సభలు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదానికి పంపాయి. ఆ చట్టం ఇంకా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని అన్నాహజారే చెప్పారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు తాను ఏడు లేఖలు రాసినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడంతో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్త చట్టాన్ని క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు చేయట్లేదో తనకు తెలియట్లేదని విమర్శించారు.



పీరియడ్స్ నిజం తెలుసుకోండి

పీరియడ్స్ లో అవి చేయకూడదు, ఇవి చేయకూడదు అంటూ చాలానే వినే ఉంటారు. వాటిల్లో ఏది నిజం. శాస్త్రవేత్తలు, నిపుణులు ఏం చెబుతున్నారు... పీరియడ్స్ మహిళలకు సర్వ సాధారణం. ప్రతినెలా పీరియడ్స్ వస్తూనే ఉంటాయి. అయితే.. ఈ పీరియడ్స్ విషయంలో చాలా కామన్ గా ఎన్నో అపోహలు ప్రచారంలో ఉన్నాయి. పీరియడ్స్ లో అవి చేయకూడదు, ఇవి చేయకూడదు అంటూ చాలానే వినే ఉంటారు. చాలా వరకు అపోహలు మాత్రమే..

పీరియడ్స్ లో మహిళలు అపవిత్రులు అవుతారా?

ఇప్పటికీ పీరియడ్స్ సమయంలో చాలా మంది మహిళలను ఇంట్లోకి రానివ్వరు. దూరంగా ఉంచుతారు. కొన్ని ప్రదేశాలకు వెళ్లకూడదని, గుడికి వెళ్లకూడదు, వంట చేయకూడదు అని చెబుతుంటారు. కానీ, శాస్త్రీయంగా చూస్తే పీరియడ్స్ అనేది సహజ ప్రక్రియ. ఇది మహిళ శారీరకంగా ఆరోగ్యంగా ఉంది అనేదానికి సంకేతం. అపవిత్రం అనడం అనేది పూర్తిగా అపోహ మాత్రమే.

చల్లని పదార్థాలు తినకూడదా..?

చాలా మంది పీరియడ్స్ సమయంలో చల్లనివి అంటే.. పెరుగు, ఐస్ క్రీమ్, కొబ్బరి నీళ్లు తీసకోకూడదని, నొప్పి ఎక్కువ అవుతుందని అంటారు. ఇది కూడా పూర్తిగా అపోహ మాత్రమే. . శరీరానికి చల్లని లేదా వేడిగా ఉండే ఆహారంతో సంబంధం లేదు. కొన్ని మహిళలకు చల్లని ఆహారం తీసుకున్నప్పుడు అసౌకర్యంగా అనిపించవచ్చు, కానీ అది అందరికీ వర్తించదు. రుతుస్రావ సమయంలో పోషకాహారం తీసుకోవడం ముఖ్యం.



ఈ రోజుల్లో శరీరశ్రమ చేయకూడదు?

"పీరియడ్స్ సమయంలో నడవకూడదు, ఎక్కువ పనులు చేయకూడదు" అని చాలా మంది పెద్దవారు అంటారు. పీరియడ్స్ లో కొంత మంది మహిళలకు అలసట ఎక్కువగా ఉండవచ్చు. అయితే, సాధారణంగా తగిన శరీరశ్రమ మంచి ఫలితాల్ని ఇస్తుంది. హార్మోన్ల స్థాయిని మెరుగుపరిచేలా హెల్తీ యాక్టివిటీస్ ఉంటే మరింత మంచిది. కొన్ని వ్యాయామాలు చేయడం వల్ల నొప్పి కూడా తగ్గుతుంది.

పీరియడ్స్ లో స్విమ్మింగ్...

పీరియడ్స్ సమయంలో స్విమ్మింగ్ చేస్తే , నీటిలోకి వెళితే ఇన్ఫెక్షన్లు వస్తాయి అని చాలా మంది అంటుంటారుఇది అపోహ మాత్రమే. మెన్‌స్ట్రువల్ హైజీన్ పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ట్యాంపూన్, మెన్‌స్ట్రువల్ కప్ వాడితే స్విమ్మింగ్ కూడా సురక్షితమే. అయితే నీటి శుభ్రత అనేది చాలా ముఖ్యమైన అంశం.

పీరియడ్స్ లో శరీరంలోని మలినాలు బయటకి వస్తాయా?

"పీరియడ్స్ అనేది శరీరంలోని టాక్సిన్స్ (విష పదార్థాలు) బయటకు పంపే ప్రక్రియ" అనే అపోహ ఉంది. ఇందులోనూ ఎలాంటి నిజం లేదు. రుతుస్రావం అనేది యుటరస్ లోని లైనింగ్ బయటకు వస్తూ ఉండే సహజ ప్రక్రియ. ఇది గర్భం ఏర్పడకపోయినప్పుడు జరిగే సాధారణ శరీర ప్రక్రియ మాత్రమే. టాక్సిన్స్ లేదా మలినాలను బయటకు పంపే ప్రక్రియ కాదు.

పిల్లలకు ఫస్ట్ టైం పీరియడ్స్.. | పేరెంట్స్ ఇవి తెలుసుకోండి



చాలా మంది పేరెంట్స్.. పిల్లలకు పీరియడ్స్ మొదలయ్యాక.. ఎలా ఉండాలి? ఏం చేయాలి లాంటివి అనుకుంటారు. కానీ.. పిల్లలను ఈ విషయంలో ముందుగానే ప్రిపేర్ చేయాలట. ఒకప్పుడు ఆడపిల్లలు పద్నాలుగు, పదిహేను సంవత్సరాలు వచ్చే సమాయానికి మొదటి పీరియడ్ మొదలయ్యేది. కానీ, ఇప్పుడు ఎనిమిది, తొమ్మిదేళ్లకే పీరియడ్స్ రావడం మొదలౌతున్నాయి. ఇంత చిన్న పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడం కూడా కష్టంగా మారుతోంది. మరి, పిల్లలకు ఏడు సంవత్సరాలు వచ్చే సరికే.. వారిని పీరియడ్స్ విషయంలో ప్రిపేర్ చేయాలట. వారిని భయపెట్టేలా కాకుండా, అర్థమయ్యేలా చెప్పాలి. పీరియడ్స్ సమయంలో రక్తస్రావం జరుగుతుందని.. అయితే.. అది దెబ్బ తగలడం వల్ల కాదని..వారికి వివరించాలి. ఇలా ప్రతి నెలా వస్తూనే ఉంటుందని వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఆ రక్తం చూసి భయపడకూడదని , అలా వచ్చినప్పుడు ఏం చేయాలో వారికి చెప్పాలి. ఆ సమయంలో ఎంత పరిశుభ్రంగా ఉండాలో లేకపోతే ఎలాంటి సమస్యలు వస్తాయో కూడా వివరించాలి.

13 సంవత్సరాల వయస్సు ముందు పిల్లలకు పీరియడ్స్ రావడం సాధారణమేనా?

మొదటి పీరియడ్ సగటు వయస్సు 12.4 సంవత్సరాలు. కాబట్టి, దాదాపు సగం మంది అమ్మాయిలకు 13 సంవత్సరాల వయస్సు ముందే పీరియడ్స్ వచ్చేస్తున్నాయి కానీ కొంతమందికి 9 లేదా 10 సంవత్సరాల వయస్సులో మొదటి పీరియడ్ వచ్చేస్తోంది.

పిల్లల పీరియడ్స్ ప్రారంభమై ఆగిపోతుందా?

పీరియడ్స్ మొదటి కొన్ని సంవత్సరాలలో ఋతుచక్రం అనూహ్యంగా ఉంటుంది. మొదటి , రెండవ ఋతుచక్రాల మధ్య తరచుగా అంతరం ఉంటుంది. ఆ తర్వాత, ఋతుచక్రాలు క్రమరహితంగా ఉండే అవకాశం ఉంది, 20 , 45 రోజుల మధ్య మారుతూ ఉంటుంది. కొందరికి క్రమం తప్పకుండా నెలకు ఒకసారి వచ్చేస్తూ ఉంటాయి. కొందరికి 20 రోజులకి ఒకసారి రావడం లేదంటే.. మరి కొందరికి 45 రోజులకు ఒకసారి కూడా రావచ్చు. మూడేళ్ల తర్వాత నుంచి సరిగ్గా రావడం మొదలౌతాయి.

మీ పిల్లల పీరియడ్స్ త్వరలో వస్తుందో లేదో మీరు ఎలా చెప్పగలరు?

అదృష్టవశాత్తూ, మీ పిల్లల మొదటి పీరియడ్స్ ముందు మీకు బహుశా రెండు సంవత్సరాల హెచ్చరిక ఉంటుంది. పీరియడ్స్ ప్రారంభానికి ముందు జరిగే యుక్త వయసు లక్షణాలు కనపడుతూ ఉంటాయి. అంటే రెండు, మూడేళ్లకు ముందే పిల్లల్లో రొమ్ముల పరిమాణం పెరిగిపోతుంది. ప్రైవేట్ భాగాల్లో వెంట్రుకలు రావడం మొదలౌతాయి. వీటితో పాటు... ముఖంపై మొటిమలు, పిల్లల్లో మూడ్ స్వింగ్స్ లాంటివి వస్తాయి. కాబట్టి.. వీటి ఆధారంగా పిల్లల్లో పీరియడ్స్ మొదలౌతున్నాయని గుర్తించవచ్చు.



చంద్రుడిపైకి పంపించాలా?

- భూకంపాలపై పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 12: దేశంలో భూకంపాల వల్ల జరిగే నష్టాలను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచనలు చేయాలని ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దేశంలోని 75 శాతం జనాభా అధిక భూకంప ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ఉన్నారని, భూకంపాల వల్ల జరిగే నష్ట తీవ్రతను తగ్గించేలా సూచనలు చేయాలని కోరుతూ ఓ వ్యక్తి పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. గతంలో ఢిల్లీ మాత్రమే భూకంప ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతంగా ఉండేదని, ఇప్పుడు దేశంలో 75 శాతం మంది తీవ్ర భూకంప ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటున్నారని పిటిషనర్ చెప్పడంతో.. 'అయితే అందరినీ చంద్రుడిపైకి పంపించాలా.. లేదంటే మరెక్కడికైనానా..?' అని ధర్మాసనం ప్రశ్నించింది. దాంతో పిటిషనర్.. ఇటీవల జపాన్‌లో తీవ్ర భూకంపం సంభవించిన విషయాన్ని గుర్తుచేశారు. దాంతో.. ముందుగా మనం దేశంలోకి అగ్నిపర్వతాలను తీసుకొచ్చి, ఆ తర్వాత జపాన్‌తో పోల్చాలని కోర్టు వ్యాఖ్యానించింది. భూకంపాల సందర్భంగా నష్ట తీవ్రతను తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని పిటిషనర్ కోరగా.. ఆ పని చేయాల్సింది ప్రభుత్వమని, కోర్టు కాదని ధర్మాసనం స్పష్టంచేసింది.



'రాహుల్' ఒక అబద్ధాల దుకాణం

- సభలో మండిపడిన బీజేపీ సభ్యులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 12: లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీపై అధికార బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. రాహుల్‌గాంధీని ఒక అబద్ధాల దుకాణంగా అభివర్ణించింది. రాహుల్‌గాంధీ తనను తాను ఒక అబద్ధాల దుకాణంగా నిరూపించుకుంటున్నారని వ్యాఖ్యానించింది. లోక్‌సభలో వందేమాతరంపై, ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతుంటే ప్రతిపక్షం తేలిపోయిందని విమర్శించింది. కాంగ్రెస్ తీరును ఎండగడుతుంటే కాంగ్రెస్ సభ్యులు బిత్తరపోయారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా ఎద్దేవా చేశారు. వందేమాతరంపై, ఎన్నికల సంస్కరణలపై పార్లమెంట్ ఉభయసభల్లో చర్చల సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు అద్భుత ప్రదర్శన కబరిచారన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై శుక్లా స్పందించారు. ప్రతిపక్ష సభ్యులు చర్చలో తేలిపోయారని పేర్కొన్నారు.

మరో 10 మంది మావోయిస్టుల లొంగుబాటు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బస్తర్, డిసెంబర్ 13: ఆపరేషన్ ఖగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నక్సలిజం నిర్మూలనకు పూనుకున్నప్పటి నుంచి ఎంతో మంది నక్సలైట్‌లు ఎన్‌కౌంటర్లలో మరణించారు. అదేవిధంగా భారీ సంఖ్యలో నక్సల్స్ విడతల వారీగా లొంగిపోతున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ లోని బస్తర్ ప్రాంతంలో మరో 10 మంది నక్సైట్‌లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. ఈ విషయాన్ని బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ మీడియాకు వెల్లడించారు. బస్తర్ రీజియన్‌లో నక్సలిజాన్ని రూపుమాపి, అభివృద్ధికి బాటలు వేయడం కోసం తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇందుకోసం భద్రతా బలగాలు పలు ఆపరేషన్‌లు చేపడుతున్నాయని అన్నారు. ఫలితంగా పెద్ద సంఖ్యలో నక్సలైట్‌లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని చెప్పారు.





ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

సెంచరీతో విరుచుకుపడ్డ 'వైభవ్'

అండర్ 19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

అండర్ 19 ఆసియా కప్‌ను భారత జట్టు ఘనంగా ఆరంభించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(171) విధ్వంసక శతకంతో కొండంత స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం యూఏఈ ని రెండొందలలోపే కట్టడి చేసింది. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ సెంచరీతో విరుచుకుపడగా.. అరోన్ జార్జ్(69), విహాన్ మల్హోత్రా(69)లు అర్ధ శతకాలతో రెచ్చిపోయారు. టాపార్డర్ రాణించడంతో ప్రత్యర్థికి అసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. అనంతరం బౌలర్లు విజృంభించగా 234 పరుగుల తేడాతో అదిరే బోణీ కొట్టింది ఆయుశ్ మాత్రే బృందం. దుబాయ్‌లో జరుగుతున్న అండర్ 19 ఆసియా కప్‌లో భారత్ రికార్డు స్కోర్‌తో బోణీ చేసింది. ఆతిథ్య యూఏఈ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ.. ఫీల్డర్లను బౌండరీ వద్దకు పరుగులు పెట్టిస్తూ వైభవ్ సూర్యవంశీ(171: 95 బంతుల్లో 9 ఫోర్లు, 14 సిక్సర్లు) శతక్కొట్టగా.. టీమిండియా బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లను గొప్పగా కట్టడి చేశారు. అన్ని విభాగాల్లో అదుర్స్ అనిపించిన టీమిండియా 234 పరుగుల తేడాతో టోర్నీలో శుభారంభం చేసింది. సూపర్ సెంచరీతో విజృంభించిన వైభవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. వైభవ్ ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ అరోన్ జార్జ్(69), విహాన్ మల్హోత్రా(69)లు హాఫ్ సెంచరీలతో మెరిశారు. ఫలితంగా.. నిర్ణీత ఓవర్లలో 433 పరుగులు చేసింది టీమిండియా. అనంతరం భారీ ఛేదనలో యూఏఈ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. టాపార్డర్ కుప్పకూలగా పృథ్వీ మధు(50), ఉద్దిశ్ సూరి(78) అర్ధ శతకంతో ఏడు వికెట్లు కోల్పోయి 199 రన్స్ చేసిందంతే. దుమ్మురేపే ఆటతో 234 పరుగుల విజయం సాధించిన భారత్ 'మాతో జాగ్రత్త' అని ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపింది. మరో మ్యాచ్‌లో మలేషియాపై 297 పరుగులతో పాకిస్థాన్ గెలుపొందింది. డిసెంబర్ 14న భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది.



ఫామ్‌లో లేరు!

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. గత కొద్ది కాలంగా ఫామ్ లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సౌతాఫ్రికాతో జరిగిన రెండు టీ20ల్లోనూ పేలవ ప్రదర్శనే కనబర్చారు. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో సూర్య 5, గిల్ 0 పరుగులకే ఔటయ్యారు. వీరిద్దరి ఫామ్‌పై విమర్శలు వస్తున్న నేపథ్యంలో టీమిండియా సహాయ కోచ్ ర్యాన్‌టెన్ డస్కాటే.. కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆస్ట్రేలియా పర్యటన చివరిలో గిల్ మనస్తత్వంలో మంచి మార్పులే వచ్చాయి. ప్రస్తుత సిరీస్‌లో గిల్ ఔట్ అయిన విధానానికి నేను పెద్దగా ఆందోళన చెందను. ఎందుకంటే తొలి టీ20లో మేమే ఆటగాళ్లను పవర్ ప్లేలో దూకుడుగా ఆడమని చెప్పాం. అయితే కటక్‌లో బ్యాటర్లకు అనుకూలించే పిచ్ కాదు. కాబట్టి ఆ మ్యాచులో గిల్ ఆట గురించి పెద్దగా మాట్లాడను. ఇక రెండో టీ20 విషయానికొస్తే.. బ్యాటర్ ఫామ్‌లో లేనప్పుడు మంచి బంతులకు కూడా కొన్నిసార్లు అలా జరుగుతుంది' అని ర్యాన్‌టెన్ అన్నాడు. 'గిల్ ఐపీఎల్‌లో దాదాపు 800 పరుగులు చేశాడు. మాకు అతడిపై నమ్మకం ఉంది. సూర్య కుమార్ విషయంలో కూడా అదే దృక్పథంతో ఉన్నాం. కెప్టెన్సీ పాత్రల విషయంలో మా ప్రణాళికలో ఇప్పటికే చాలా దూరం వెళ్లాం. నాణ్యమైన ఆటగాళ్లు, కెప్టెన్లకు మనం మద్దతు ఇవ్వాలి. బయటి నుంచి చూస్తే వాళ్ల పరిస్థితి, ఫామ్ కాస్త ఆందోళనకరంగానే కనిపిస్తుంది. కానీ వారు తిరిగి పుంజుకుంటారని మాకు ఆ ఇద్దరి విషయంలో పూర్తి విశ్వాసం ఉంది' అని ర్యాన్‌టెన్ వెల్లడించాడు.



వినేశ్ ఫొగట్.. రిటైర్మెంట్ వెనక్కి!!

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పారిస్ ఒలింపిక్స్‌తో అనూహ్యంగా అనర్హత వేటుకు గురైన వినేశ్.. ఆ షాక్‌తో రిటైర్‌మెంట్ ప్రకటించిన వినేశ్.. తాజాగా దాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో ఆడతానని శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. 'పారిస్ ఒలింపిక్స్ తర్వాత నాకు ఎన్నో ప్రశ్నలు ఎదురయ్యాయి. 'ఇదే ముగింపా?' అని కూడా అడిగారు. అప్పుడు నా దగ్గర సమాధానం లేదు. అనూహ్యంగా అనర్హత వేటు పడటంతో తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొన్నాను. దాంట్లో నుంచి బయట పడటానికి నాకు ఎంతో సమయం పట్టింది. మళ్లీ ఆటలోకి దిగాలి అనుకుంటున్నా. ఒలింపిక్ పథంలోకి మళ్లీ అడుగు పెట్టాలనుకుంటున్నా. ఈ సారి నేను ఒంటరిగా బరిలోకి దిగట్లేదు. నా వెంట నా కొడుకు వస్తున్నాడు. నన్ను ప్రోత్సహించేందుకు నా కొడుకు సిద్ధమయ్యాడు. లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌లో కలుద్దాం' అని వినేశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 50 కిలోల విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించిన వినేశ్... 100 గ్రాములు అధిక బరువు కారణంగా అనర్హత వేటుకు గురైంది. వెంటనే ఆమె కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (CAS)ను ఆశ్రయించి, తనకు జాయింట్ సిల్వర్ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసింది. కానీ విచారణ అనంతరం CAS ఆమె అప్పీల్‌ను తిరస్కరించింది. దీంతో తీవ్ర నిరాశలో ఆమె రిటైర్మెంట్ ప్రకటించింది. ఆసియా, కామన్వెల్త్ గేమ్స్‌ల్లో మూడు సార్లు బంగారు పతకాలు సాధించింది వినేశ్. ఇప్పుడు మళ్లీ రంగంలోకి దిగుతూ, తన కెరీర్‌లో మొదటి ఒలింపిక్ మెడల్ కోసం పోరాడేందుకు సిద్ధమవుతోంది.



'స్మాట్'లో అవినీతి... నలుగురు క్రికెటర్ల సస్పెన్షన్

దేశవాళీ క్రికెట్లో అవినీతికి పాల్పడిన నలుగురిపై వేటు పడింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అవినీతికి తెరతీసిన వారిని శుక్రవారం అస్సాం క్రికెట్ సంఘం సస్పెండ్ చేసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఏసీఏ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేకాదు విచారణ పూర్తయ్యేంతవరకూ ఈ నలుగురు ఎలాంటి క్రికెట్ కార్యకలాపాల్లోనూ పాల్గొనవద్దని ఆదేశించింది. అయితే.. ఆ నలుగురు ఎవరన్నది మాత్రం వెల్లడించలేదు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తమ రాష్ట్ర క్రికెటర్లు అవినీతికి పాల్పడడాన్ని అస్సాం క్రికెట్ సంఘం సీరియస్‌గా తీసుకుంది. ప్రాథమిక విచారణలో జూనియర్ జట్లకు ప్రాతనిధ్యం వహించే నలుగురికి సంబంధముందనే విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు ఏసీఏ ఫిర్యాదు చేశామని ఏసీఏ కార్యదర్శి సనాతన్ దాస్ వెల్లడించారు. 'అవినీతి ఆరోపణలు మా దృష్టికి రాగానే బీసీసీఐ అవినీతి నిరోధక, భద్రతా విభాగం విచారణ చేపట్టింది. ఏసీఏ సైతం నలుగురు క్రికెటర్ల పాల్పడిన నేరంపై చర్యలకు ఉపక్రమించింది. క్రికెటర్ల ఐక్యతను, ఆటకున్న పేరును చెడకొట్టేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించిన ఏసీఏ అవినీతికి పాల్పడిన నలుగురిని సస్పెండ్ చేసింది' అని సనాతన్ దాస్ పేర్కొన్నారు. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 8 వరకూ లక్నో వేదికగా స్మాట్ మ్యాచ్‌లు జరిగాయి.



అంచనాలు దాటేసిన అఖండ 2

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన 'అఖండ 2' చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందు కొచ్చింది. అనివార్య కారణాల వల్ల 'అఖండ2' సినిమా వారం రోజులు వాయిదా పడిందని, ఈ విషయంలో బాలకృష్ణ అభిమానులకు తమ నిర్మాణ సంస్థ తరపున క్షమాపణలు చెబుతున్నామని, విడుదల తాలూకు సమస్యని పరిష్కరించడంలో మ్యాంగో మీడియా రామ్, నిర్మాత దిల్ రాజు మద్దతుగా నిలిచారని చిత్ర నిర్మాతలు గోపీచంద్ ఆచంట, రామ్ ఆచంట తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో నిర్మాతలు మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. సినిమాకు అన్ని ఏరియాల నుంచి పాజిటివ్ రిపోర్ట్స్ వస్తున్నాయని, మౌత్‌టాక్ అద్భుతంగా ఉందని, ఉత్తరాదిన 800 స్క్రీన్లలో విడుదల చేయగా, అక్కడ కూడా వసూళ్లు బాగున్నాయని గోపీచంద్ ఆచంట పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వేసిన ప్రీమియర్స్‌కి 10కోట్ల గ్రాస్ కలెక్షన్స్ లభించాయని, ప్రేక్షకుల నుంచి అంచనాలను మించిన స్పందన లభిస్తున్నదని, వారాంతంలో ఫ్యామిలీ ఆడియెన్స్ వల్ల కలెక్షన్స్ ఇంకా పెరుగుతాయని రామ్ ఆచంట పేర్కొన్నారు.

ఆరు నెలల తర్వాత

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ దాదాపు ఆరు నెలల విరామం తర్వాత 'డ్రాగన్' సెట్స్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇప్పటికే కొంతభాగం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అయితే గత ఆరు నెలలుగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో అభిమానులు నిరుత్సాహంలో ఉన్నారు. వారి నిరీక్షణకు తెరదించుతూ ఈ సినిమా తాజా షెడ్యూల్ నేటి నుంచి హైదరాబాద్‌లో మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు కథానాయిక రుక్మిణి వసంత్ కూడా పాల్గొంటున్నదని, దాదాపు 20రోజుల పాటు జరిగే నైట్ షెడ్యూల్‌లో కీలక ఘట్టాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా తెరకెక్కిస్తారని సమాచారం. మరోవైపు ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నారని వార్తలొస్తున్నాయి. అందుకోసం స్క్రిప్ట్‌లో అవసరమైన మార్పులు చేశారని టాక్ వినిపిస్తున్నది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి.





వేగంగా... వందో సినిమా

అగ్ర హీరో అక్కినేని నాగార్జున 100వ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు అక్టోబర్‌లో జరిగిన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైంది. హైదరాబాద్, మైసూర్‌లో కొంతభాగం చిత్రీకరణ జరిగినట్టు సమాచారం. ప్రస్తుతం 'బిగ్‌బాస్'కోసం నాగ్ బ్రేక్ ఇచ్చారని తెలిసింది. ఆ సినిమా కోసం దర్శకుడు రా కార్తీక్ అద్భుతమైన కథను సిద్ధం చేశారనేది ఫిల్మ్ వర్గాల టాక్. త్వరలోనే ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ మొదలు కానున్నది. 2027 సంక్రాంతికి సినిమాను విడుదల చేసేలా మేకర్స్ ప్లాన్ చేశారట. నాగార్జున హీరోగా రూపొందుతున్న తొలి పాన్ ఇండియా సినిమా ఇదే కావడం విశేషం. నేషనల్ లెవల్ ఆడియన్స్‌ని మెప్పించే కథ, కథనాలతో ఈ సినిమా ఉంటుందని తెలిసింది. లాటరీ కింగ్, కింగ్ 100, 100 నాట్ అవుట్ అనే మూడు టైటిల్స్ ఈ సినిమా కోసం అనుకుంటున్నారు. ఇంకా ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సివుంది. అన్నపూర్ణ స్టూడియో సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కుతున్నది.

'మోగ్లీ' జెన్యూన్ లవ్ స్టోరీ

హీరో రోషన్ కనకాల



యంగ్ హీరో రోషన్ కనకాల తన రెండవ చిత్రం మోగ్లీ 2025 తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే టీజర్, పాటలు, ట్రైలర్‌తో స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ప్రీమియర్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం డిసెంబర్ 13న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో రోషన్ కనకాల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

మోగ్లీ కథ ఎలా ఉండబోతుంది?

ఇది ప్యూర్ అండ్ ఇన్నోసెన్స్ వుండే లవ్ స్టోరీ. ఒక్క క్షణం కూడా బోర్ కొట్టకుండా డైరెక్టర్ సందీప్ ఈ సినిమాకి స్క్రీన్ ప్లే డిజైన్ చేశారు. స్క్రీన్ ప్లే చాలా రేసీగా ఉంటుంది. ఇందులో హానెస్ట్ లవ్ స్టోరీ ఉంటుంది. ఆ ప్రేమ కథని అద్భుతంగా పండించాడు. ఈ కథలో కామెడీ యాక్షన్ అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. చాలా ఆర్గానిక్, జెన్యూన్ గా రాశాడు. మోగ్లీ తన ప్రేమ కోసం దేనికైనా రెడీగా ఉంటాడు. తన ప్రేమ కథకు వచ్చిన అడ్డంకేంటి? క్రిస్టఫర్ నోలన్ నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి అనేదాన్ని బట్టి ఈ కథ ముందుకు వెళుతుంది. మోగ్లీ అందరికీ కనెక్ట్ అయ్యే క్యారెక్టర్. అందరూ కూడా ఆ క్యారెక్టర్ కి రిలేట్ అవుతారు.

బబుల్ గమ్ తర్వాత ఈ కథ ఎంచుకున్నారు కదా.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

ఆడియన్స్ థియేటర్స్ కి వచ్చిన తర్వాత ఒక్క క్షణం కూడా బోర్ ఫీల్ కాకుండా ఉండే కథ కోసం ఎదురుచూస్తున్న సమయంలో సందీప్ ఈ కథతో వచ్చారు ఇది థియేటర్స్ లో ఎక్స్పీరియన్స్ చేయాల్సిన కథ.

మోగ్లీ జస్టిఫికేషన్ ఏమిటి?

ఈ కథ అనుకున్నప్పుడే ఈ టైటిల్ ని అనుకున్నాం. ఇది ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో జరిగే కథ. ఇందులో హీరో క్యారెక్టర్ కి ఈ టైటిల్ ఫర్ఫెక్ట్ యాప్ట్. అలాగే ప్రేమ కథ కూడా హెల్ప్ అవుతుంది.

ఫారెస్ట్ బ్యాక్ గ్రౌండ్ లో షూటింగ్ చేయడం చాలెంజింగ్ అనిపించిందా?

ప్రాక్టికల్ గా చూసుకుంటే కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అయితే నేను అన్ని ఎంజాయ్ చేస్తూ చేశాను. చేసే పనిని ప్రేమించి చేశాను. దీంతో అంతా సరదాగ గడిచింది. 60% ఆఫ్ షూటింగ్ ఫారెస్ట్ లోనే చేశాము. సినిమాలో అన్ని రియల్ లొకేషన్స్ ఉంటాయి. ఈ సినిమా తర్వాత ఫారెస్ట్ కి చాలా డీప్ గా కనెక్ట్ అయ్యాం

మీకు ఇంట్లో ఎలాంటి సజెషన్స్ ఇస్తుంటారు?

నటనపరంగా నాన్నకి నాకు ఎప్పుడూ ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. అలాగే అమ్మతో కూడా మాట్లాడుతూ ఉంటాను. డిస్కషన్ ఎప్పుడు ఉండాలని కోరుకుంటాను. వాళ్ళు కూడా నాకు అవసరమైన సజెషన్స్ ఇస్తూనే ఉంటారు. ఈ సినిమాకి కూడా కొన్ని సజెషన్స్ ఇచ్చారు. అవి చాలా బాగా వర్కౌట్ అయ్యాయి. చిన్నప్పుడే సినిమా వాతావరణంలో ఉండడంతో సినిమా మీద నాకు ఒక ప్రేమ ఏర్పడిపోయింది. ఈ విషయంలో నాకు ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ ప్రయాణాన్ని నేను ఆస్వాదిస్తున్నాన. ఒక్కొక్కటి నేర్చుకుంటున్నాను.

ఈ సినిమాలో మీది, బండి సరోజ్ కాంబినేషన్ ఎలా ఉండబోతుంది?

ఈ కథకి ఆయన చాలా పర్ఫెక్ట్ గా సింక్ అయ్యారు. ఆ క్యారెక్టర్ ని చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. మా మధ్య ఉండే సీన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి.

హర్ష తో మీ కాంబినేషన్ ఎలా ఉండబోతుంది?

హర్ష ఇందులో చాలా ఇంపాక్ట్ ఫుల్ క్యారెక్టర్ చేశాడు. కథలో తన పాత్ర చాలా కీలకం. మా ఇద్దరి మధ్య జెన్యూన్ గా ఫ్రెండ్షిప్ వర్కౌట్ అయింది.

కాలభైరవ మ్యూజిక్ గురించి?

కాలభైరవ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. కీరవాణి గారు రాజమౌళి గారికి బ్యాగ్రౌండ్ స్కోరు ఇచ్చినంత రేంజ్ లో మ్యూజిక్ ఉంటుంది. సందీప్ కి భైరవకు అనుబంధం కారణంగా ఇంకా అద్భుతమైన ట్రాక్స్ వచ్చాయి. తన మ్యూజిక్ తో సినిమాని మరో స్థాయికి ఎలివేట్ చేశారు.

హీరోయిన్ సాక్షి గురించి?

తను చాలా మంచి నటి. సినిమా కోసం సైన్ లాంగ్వేజ్ కూడా నేర్చుకుంది. ఈ సినిమాలో మా ఇద్దరి కెమిస్ట్రీ పండితేనే కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. అలాంటి కెమిస్ట్రీ చాలా చక్కగా కుదిరింది. ఈ సినిమా టీం అందరం కూడా ఒక ఫ్యామిలీ లాగే వర్క్ చేసాము.

సెలబ్రిటీ ప్రీమియర్ షో వేశారు కదా.. ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?

అందరికీ చాలా నచ్చింది. శ్రీ విష్ణు సినిమా గురించి చాలా ప్రత్యేకంగా మాట్లాడారు. సాయి రాజేష్, ఎస్ కే ఎన్.. ఇలా ఎంతోమంది ప్రముఖులు వచ్చారు. అందరికీ నచ్చింది. సినిమా గురించి జెన్యూన్ గా అనిపించింది చెప్పారు. చాలా హ్యాపీగా ఉంది.

ఈ సినిమాలో ఎన్ని గుర్తుండిపోయే సీన్స్ ఉంటాయి?.

ఓవరాల్ గా సినిమా అంతా గుర్తుండిపోతుంది. నేను పర్సనల్ గా ఎంజాయ్ చేసిన సీన్స్ అలాగే ఆడియన్స్ కచ్చితంగా ఎంజాయ్ చేస్తారనుకునే సీన్స్ కొన్ని ఉన్నాయి. ఇంటర్వెల్, ప్రీ ఇంటర్వెల్ చాలా ఎంగేజింగ్ గా ఉంటుంది. ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ కూడా అద్భుతంగా ఉంటాయి. ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

హార్స్ రైడింగ్ గురించి ?

ప్రీఇంటర్వెల్ దగ్గర హార్స్ రైడ్ సీక్వెన్స్ ఉంది. అది ఎమోషనల్ సీక్వెన్స్. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. నేను ఆ ప్రాసెస్ ని చాలా ఎంజాయ్ చేశాను. ఒక యానిమల్ ని తెలుసుకోవడం అనేది సర్ప్రైజింగ్ ప్రాసెస్. నేను యాక్ట్ చేస్తుంటే అది కూడా యాక్ట్ చేస్తుంది. అది నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

మోగ్లీ జర్నీ ఎలా అనిపించింది?

డైరెక్టర్ సందీప్ ,నేను ఈ ప్రయాణంలో చాలా క్లోజ్ అయ్యాం. మా మనసులో ఉన్న మాటలు మాకు తెలిసిపోతాయి. ఈ సినిమా కోసం ఒక రోలర్ కోస్టర్ లాంటి ఎమోషన్స్ ని చూశాం. ఒక యాక్టర్ గా నాకు చాలా అద్భుతమైన కథని తీసుకొచ్చారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.

నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ గారి గురించి?

విశ్వప్రసాద్ గారు నా మొదటి సినిమా బబుల్ గమ్ కి చాలా సపోర్ట్ చేశారు, మోగ్లీ కథ ఆయనకి చాలా నచ్చింది. ఫస్ట్ డే నుంచి ఆయన చాలా సపోర్ట్ చేశారు. ఎంతో కేర్ తీసుకున్నారు. ఇంత పెద్ద సినిమాలాగా రావడానికి కారణం ఆయనే.

కొత్తగా చేస్తున్న ప్రాజెక్టు గురించి?

రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి. ఒకటి ప్రీ ప్రొడక్షన్ నడుస్తుంది. ఇది ఇంటెన్స్ లవ్ స్టోరీ. మరొక ప్రాజెక్టు రొమాంటిక్ కామెడీ. త్వరలోనే ఆ సినిమాల వివరాలను తెలియజేస్తాం.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200